'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి ॥ సంపుటి : 1 ॥ సంచిక : 14 ॥ శుక్రవారం ॥ 28.08.2026 ॥ పేజీలు : 8 ॥ వెల రూ. 2

Medchal Malkajgiri ॥ Volume: 1 ॥ Issue: 14 ॥ Friday ॥ 28.08.2026 ॥ Pages: 8 ॥ Rate: 2

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..




## కొండాకు చెక్.. రేవంత్ మాస్టర్ స్ట్రోక్

• ఓరుగల్లులో మారుతున్న ఈక్వేషన్స్

వరంగల్ ఈస్ట్‌లో కొండా దంపతుల రాజకీయ ఆధిపత్యానికి సీఎం రేవంత్ రెడ్డి చెక్ పెట్టే వ్యూహం అమలు చేస్తున్నారన్న చర్చ కాంగ్రెస్‌లో జోరుగా సాగుతోంది. నేరుగా ఢీకొనకుండా కొండా వర్గానికి ప్రత్యామ్నాయంగా ఇతర నేతలను బలోపేతం చేయడం ద్వారా రాజకీయ సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందనే విశ్లేషణ వినిపిస్తోంది. ఆయుబ్, బసవరాజు సారయ్య, నాయిని సుధారాణి, నాగరాజు, నాయిని రాజేందర్, కడియం శ్రీహరి వంటి నేతల పేర్లు చర్చలోకి రావడం ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యత తెచ్చింది. అయితే వీరంతా కొండా వర్గానికి వ్యతిరేకంగా ఒకే వేదికపై ఉన్నారనే అధికారిక ప్రకటనలు లేవు. అయినప్పటికీ కొండా వర్గానికి గతంలో ఉన్నంత రాజకీయ పట్టు ఇప్పుడు లేదనే భావన కాంగ్రెస్‌లోని కొన్ని వర్గాల్లో బలపడుతోంది. సీనియర్ల స్థానంలో కొత్త తరం నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలన్న రేవంత్ ఆలోచన అమలైతే ఈ మార్పులు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది. డిలిమిటేషన్‌తో నియోజకవర్గాల లెక్కలు మారితే పరిస్థితి మరింత తారుమారయ్యే అవకాశం ఉంది. దీంతో ఓరుగల్లులో కొండా వర్గం ప్రభావాన్ని పరిమితం చేయడమే రేవంత్ రాజకీయ లెక్కగా మారిందా? అనే ప్రశ్న ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

### అధిష్ఠానానిదే తుది నిర్ణయం

**పార్టీ నిర్ణయమే ఫైనల్ అన్న పీసీసీ చీఫ్**



మంత్రి కొండా సురేఖ వ్యవహారం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వివాదానికి కేంద్రంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో సురేఖకు పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. అయితే కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇచ్చారు. ఈ అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ కొండా సురేఖ వ్యవహారం ప్రస్తుతం ఏఐసీసీ పరిధిలో ఉందని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

## భక్తుల గల్లంతుతో చలించిన జగ్గీ

నేపాల్‌లో సంభవించిన భయానక మెరుపు వరదల్లో కైలాస్ యాత్రకు వెళ్లిన యాత్రికులు గల్లంతైన ఘటన సద్గురు జగ్గీ వాసుదేవ్‌ను తీవ్రంగా కలచివేసింది. 80 మంది సభ్యులతో కూడిన యాత్రికుల బృందం విపత్తులో చిక్కుకోవడంతో ఆయన కన్నీరు మున్నీరయ్యారు. బుధవారం విడుదల చేసిన భావోద్వేగ వీడియో సందేశంలో సద్గురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. యాత్రికుల ప్రాణాలను కాపాడటం, ప్రభావిత ప్రాంతానికి సహాయక బృందాలు చేరేలా మార్గం సుగమం చేయడం ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్నా సహాయక చర్యలు ఆగకూడదని కోరారు. భారత్, చైనా, నేపాల్ దౌత్య అధికారులను ఆయన అత్యవసరంగా స్పందించాలని కోరారు. ప్రత్యేక శిక్షణ పొందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను వెంటనే రంగంలోకి దింపాలని విజ్ఞప్తి చేశారు. ప్రతికూల వాతావరణం, భారీ బురద, శిథిలాలు సహాయక చర్యలకు అడ్డంకిగా మారుతున్నాయని తెలిపారు. నేపాల్–టిబెట్ సరిహద్దులోని గ్యిరోంగ్ సమీప ట్రాన్స్ హిమాలయ మార్గంలో బుధవారం ఈ విషాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా హిమనీ ప్రవాహాలు ఉప్పొంగి, భారీ కొండచరియలు విరిగిపడి, మెరుపు వరదలు విరుచుకుపడ్డాయి. బురద, భారీ రాళ్లతో కూడిన వరద ప్రవాహం మార్గంలోని ప్రాంతాలను ముంచెత్తింది. యాత్రికుల బృందం ఉన్న ఇమ్మిగ్రేషన్ కేంద్రం కూడా ఈ విధ్వంసంలో తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. వరద ఉద్ధృతికి కీలక మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. యాత్రికుల ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్నాయి. సద్గురు కన్నీటి పర్యంతమైన దృశ్యం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో గల్లంతైన యాత్రికులను సురక్షితంగా గుర్తించి రక్షించాలంటూ వేలాది మంది అత్యవసర సహాయం కోసం పిలుపునిస్తున్నారు. ఈ ఘటన అంతర్జాతీయ స్థాయిలో సహాయక చర్యల సమన్వయాన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది.

# యాత్రికుల కోసం సద్గురు కన్నీరు




## నేపాల్ విలయం

**ఊళ్లకు ఊళ్లే గల్లంతు**

**జలప్రళయం మిగిల్చిన విధ్వంసం**

నేపాల్‌లో సంభవించిన భారీ మెరుపు వరదలు భారీ ప్రాణనష్టం, అపార ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదులు ఉప్పొంగడంతో నదీతీర గ్రామాలు, పట్టణాలు నీటి ఉద్ధృతిలో చిక్కుకున్నాయి. ఇళ్లు, మార్కెట్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి.

## భారత్‌కు మరో ముప్పు!

**చైనా డ్యామ్‌తో ఈశాన్యానికి పెను ప్రమాదం**

నేపాల్‌లో జరిగిన జలవిలయం తర్వాత భారత్‌కూ ఇలాంటి ప్రమాదం పొంచి ఉందన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా టిబెట్‌లో బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ జలవిద్యుత్ ప్రాజెక్ట్‌పై నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మపుత్రను టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బోగా పిలుస్తారు.

## వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతు

**ఆచూకీపై పెరుగుతున్న ఆందోళన**

నేపాల్‌లో సంభవించిన భయానక మెరుపు వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల్లో కనీసం 288 మంది భారతీయులు ఇంకా ఆచూకీ లేకుండా ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. గల్లంతైన వారిలో జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న కార్మికులు, పర్యాటక బృందాలకు చెందినవారు ఉన్నారు.

## జిందాల్ వర్సిటీలో కేటీఆర్ లెక్చర్



- విద్యార్థులతో ముఖాముఖికి పిలుపు
- డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్‌కు ఆహ్వానం

కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టి 2026 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు యూనివర్సిటీ తెలిపింది. కేటీఆర్ తన రాజకీయ అనుభవం, ప్రజా విధానాలపై ఆలోచనలు, తెలంగాణ అభివృద్ధి వంటి అంశాలను విద్యార్థులతో పంచుకునే అవకాశం ఉందని వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి. (వివరాలు 2లో..)




# మీరాలం చెరువుకు మహర్దశ




### తుమ్మిడిహట్టికి కదిలిన కేంద్రం

సెప్టెంబర్ 1న కీలక సమావేశం

ఢిల్లీలో తెలంగాణ- మహారాష్ట్ర చర్చలు

- పర్యాటక కేంద్రంగా కొత్త కళ
- చారిత్రక చెరువుకు పునర్వైభవం

హైదరాబాద్‌లోని చారిత్రక మీరాలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త రూపు ఇవ్వనుంది. కుటుంబాలతో వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు, వినోదాన్ని ఆస్వాదించేలా అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం చెరువును ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు వేగంగా సాగుతున్నాయి. మొత్తం 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పనులు పూర్తయినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

## డీలిమిటేషన్ అక్కర్లేదు




- లోక్‌సభలో 543 సీట్లు చాలు
- 25 ఏళ్ల పాటు సీట్లలో మార్పు వద్దు
- తేల్చి చెప్పిన ఏఐసీసీ చీఫ్ ఖర్గే

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలను మరో 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో కోరారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లో కూడా మార్పులు చేయవద్దని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే కీలక అంశమని పేర్కొన్న ఖర్గే.. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా అన్ని రాజకీయ పార్టీలతో వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## జన్‌ధన్ ఖాతాల్లో భారీగా డిపాజిట్లు




**సామాన్యుల అకౌంట్లో రూ.3.17 లక్షల కోట్లు**

**59 కోట్ల ఖాతాలతో ఆర్థిక సుస్థిరత**

దేశవ్యాప్తంగా ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన కింద తెరిచిన బ్యాంకు ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17 లక్షల కోట్లకు చేరాయి. ఇప్పటివరకు 59 కోట్లకు పైగా జన్‌ధన్ ఖాతాలు ప్రారంభమైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. (2లో..)

## ఫోన్ వద్దని మందలింపు ఇంటర్ బాలిక విషాదాంతం

**ఒక్క మాట.. కుటుంబానికి తీరని శోకం**

**కళ్లముందే కూతురు దూరమై తండ్రి ఆవేదన**

పిల్లలపై తల్లిదండ్రులు చూపించే మందలింపు ప్రేమలో భాగమే. కానీ ఆ క్షణంలో పిల్లల మనసులో ఏ తుఫాను నడుస్తుందో చాలాసార్లు పెద్దలకు తెలియదు. హైదరాబాద్‌లో జరిగిన ఈ విషాద ఘటన అలాంటి భయంకరమైన పరిస్థితినే కళ్లముందు నిలిపింది.




## కౌశిక్‌కు ఎథిక్స్ నోటీసులు

**కడియంపై వ్యాఖ్యలతో దుమారం**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగస్టు 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో విచారణ జరగనుంది. కౌశిక్‌పై వచ్చిన ఫిర్యాదును కమిటీ పరిశీలించనుంది. ఈ వ్యవహారంపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎథిక్స్ కమిటీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతోందని ఆరోపించారు. కౌశిక్ రెడ్డిని దోషిగా నిలబెట్టి చర్యలకు సిఫార్సు చేయాలనే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. (వివరాలు 2లో..)





## ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి

**జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి**

## హరీశ్‌రావు అరెస్ట్..

**పోలీస్ స్టేషన్ ముందు ధర్నా**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హర్యానాలోని ప్రముఖ ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖి సంభాషించడంతో పాటు 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని యూనివర్సిటీ కోరింది. ఈ మేరకు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ కేటీఆర్‌కు ప్రత్యేక లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు స్ఫూర్తి కలిగిస్తాయని లేఖలో పేర్కొన్నారు. (వివరాలు 2లో..)

## ఓయూకు రూపాయి ఇచ్చారా?

**పోలీస్ పాలనతో ఏం సాధిస్తారు?**

**పాలిటెక్నిక్ విద్యార్థులకి బీజేపీ మద్దతు**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో పోలీస్ నిర్బంధ పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తీవ్రంగా విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నా, వారిపై లాఠీఛార్జీలు, అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి వనపర్తి, పరకాల వరకు విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్నాయని తెలిపారు. (2లో..)





## జయరాజు ఆస్తులపై ఏసీబీ పంజా

**వంద కోట్ల సొత్తు గుర్తించిన అధికారులు**

**సోదాలతో బయటపడుతున్న చిట్టాలు**

**ఎనిమిది చోట్ల ఏకకాలంలో సోదాలు**

**వంద కోట్ల దోపిడీకి అధికారి అడ్డా?**

**జీతంతో సాధ్యమా ఈ సంపద?**

ఒక ప్రభుత్వ అధికారి.. చేతిలో ప్రభుత్వ బాధ్యత.. వెనుక ప్రజల నమ్మకం. కానీ ఆ అధికారమే అక్రమ సంపాదనకు అడ్డాగా మారితే? జీతం తీసుకుంటూ సేవ చేయాల్సిన అధికారి ఏకంగా వంద కోట్ల ఆస్తులకు ఎలా యజమాని అవుతున్నాడు? నెలల తరబడి కాదు.. ఏళ్లుగా వ్యవస్థలో పనిచేస్తూ ఇంత భారీ సంపద ఎలా పోగేసుకున్నాడు? ప్రజల నుంచి వసూలైన ప్రతి రూపాయి వెనుక ఒక కుటుంబం చెమట ఉంది. (2లో..)

## ఆటో డ్రైవర్లకు గుడ్‌న్యూస్

**రూ.200 కోట్లతో ఈవీ ఆటోలు**

తెలంగాణ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఊరటనిచ్చే కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026' అమలు చేయాలని నిర్ణయించింది. (3లో..)



# మీరాలం చెరువుకు మహర్దశ

- పర్యాటక కేంద్రంగా కొత్త కళ
- చారిత్రక చెరువుకు పునర్వైభవం



హైదరాబాద్‌లోని చారిత్రక మీరాలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త రూపు ఇవ్వనుంది. కుటుంబాలతో వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు, వినోదాన్ని ఆస్వాదించేలా అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం చెరువును ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు వేగంగా సాగుతున్నాయి. మొత్తం 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పనులు పూర్తయినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

**బోటింగ్ నుంచి గ్లాంపింగ్ వరకు**

మీరాలం చెరువు పునరుజ్జీవనంతో పాటు పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వర్షపు నీరు మూసీలోకి సులభంగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. యువత, కుటుంబాలను ఆకట్టుకునేలా బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలు అందుబాటులోకి రానున్నాయి. చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, పిల్లల ఆట స్థలాలు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్ స్పాట్లుగా తీర్చిదిద్దనున్నారు. డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు వేదికలుగా కూడా అభివృద్ధి చేయనున్నారు.

**జూతో అనుసంధానం.. పర్యాటకానికి ఊపు**

ఈ అభివృద్ధి పనుల్లో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మీరాలం అభివృద్ధిని అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. దీంతో జూకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు, కుటుంబ వినోదాన్ని ఆస్వాదించే అవకాశం ఉంటుంది. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఈ చారిత్రక ప్రాంతం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే హైదరాబాద్ వాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మీరాలం చెరువు నిలిచే అవకాశం ఉంది.



# తుమ్మిడిహట్టికి కదిలిన కేంద్రం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతర ప్రయత్నాల నేపథ్యంలో ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మరో కీలక అడుగు పడింది. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, అంతర్రాష్ట్ర సమస్యలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన సేవా భవన్‌లో జరిగే భేటీకి తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్ రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశారు. రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరిపి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పీఎంవో నుంచి జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించారు. అనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం లేఖ రాసి కేంద్ర జోక్యాన్ని కోరారు.

**152 మీటర్ల ఎత్తుపై తెలంగాణ పట్టుదల**

తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తుపై తెలంగాణ కీలక ప్రతిపాదన చేస్తోంది. మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్లకు బదులుగా 152 మీటర్ల ఎత్తుకు అంగీకారం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తరలించడం సాధ్యం కాదని, భారీ పంపులు ఉపయోగిస్తే విద్యుత్ వ్యయం గణనీయంగా పెరుగుతుందని తెలంగాణ కేంద్రానికి వివరించింది. ప్రాజెక్టును నిర్మించాలన్నదే ప్రభుత్వ ప్రధాన వాదన. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం నీటిమట్టం పెంచినా అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని తెలంగాణ చెబుతోంది. ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు కేంద్రం, మహారాష్ట్రతో ప్రభుత్వం వరుస చర్చలు కొనసాగిస్తోంది. సెప్టెంబర్ 1 సమావేశంతో తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై ముందడుగు పడుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## కొండాపై అధిష్ఠానానిదే

# తుది నిర్ణయం

**పార్టీ నిర్ణయమే ఫైనల్ అన్న పీసీసీ చీఫ్**



మంత్రి కొండా సురేఖ వ్యవహారం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వివాదానికి కేంద్రంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో సురేఖకు పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. అయితే కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇచ్చారు. ఈ అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ కొండా సురేఖ వ్యవహారం ప్రస్తుతం ఏఐసీసీ పరిధిలో ఉందని స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఇప్పటికే ఏఐసీసీకి పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో మాట్లాడే స్వేచ్ఛ ఉందని, అయితే అది పార్టీ క్రమశిక్షణకు లోబడి ఉండాలని అన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే ఎక్కువ స్వేచ్ఛ ఉందని పేర్కొన్నారు. పార్టీలో వ్యక్తిగత కోపాలు, కక్షలకు తావు లేదని స్పష్టం చేశారు.

**అధిష్ఠానం తీర్పుకు కట్టుబడి ఉంటాం**

కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అందరూ శిరసావహించాల్సిందేనని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తామని చెప్పారు. ఇదే సమయంలో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన తేల్చిచెప్పారు. రాష్ట్రానికి ఏ విధంగానూ అన్యాయం జరగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. బీసీలకు కాంగ్రెస్ ఇచ్చినంత ప్రాధాన్యం మరే పార్టీ ఇవ్వలేదని పేర్కొన్నారు. తనకు సైతం సర్ నోటీసు అందిందని, దానిపై అవసరమైన వివరాలను సమర్పిస్తానని తెలిపారు. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారంపై తుది నిర్ణయం ఇక ఏఐసీసీ చేతుల్లోనే ఉందన్న సంకేతాన్ని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టంగా ఇచ్చారు.

# జయరాజు ఆస్తులపై ఏసీబీ పంజా

- వంద కోట్ల సొత్తు గుర్తించిన అధికారులు
- సోదాలతో బయటపడుతున్న చిట్టాలు
- ఎనిమిది చోట్ల ఏకకాలంలో సోదాలు



హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు నివాసాలు, ఆయనకు సంబంధించిన ప్రాంతాల్లో ఏకకాలంలో ఎనిమిది చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాలతో పాటు భూపాలపల్లి, సూర్యాపేట, తాండూరు, వరంగల్ ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయి. జయరాజు ఇంట్లో రూ.1.50 లక్షల నగదు, సుమారు 40 తులాల బంగారు ఆభరణాలు గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బోడుప్పల్‌లో జీ+1 భవనం, భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

**బ్యాంకులో రూ.60 లక్షలు.. భూములు**

సోదాల్లో జయరాజుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలో సుమారు రూ.60 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు కూడా గుర్తించారు. జనగామలో ఆయనకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ మాట్లాడుతూ జయరాజుపై గతంలో పలు ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఆయన సన్నిహితులు, బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అక్రమాస్తుల మొత్తం విలువ రూ.100 కోట్లకు చేరే అవకాశం ఉందన్న అనుమానంతో ఆస్తుల వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



PRESS NOTE No: DATE: 27-08-2026

Case of Disproportionate Assets registered against an Assistant Director, Mines & Geology Department, presently holding FAC of Deputy Director, Mines & Geology Department, Warangal

A case of Disproportionate Assets to the known sources of income was registered by ACB, Warangal Range against Sri Bojja Jaya Raju, Assistant Director, Mines & Geology Department, Jayashankar Bhupalpally District, presently holding Full Additional Charge (FAC) of Deputy Director, Mines & Geology Department, Warangal, as he is alleged to have acquired assets by indulging in corrupt practices and dubious means during his service. As this is an offence punishable under Section 13(1)(b) r/w 13(2) of the Prevention of Corruption Act, 1988 (as amended in 2018), preliminary searches were conducted on 27.08.2026 at 8 places relating to the accused officer, his relatives and associates.

During the searches, several property documents and assets were identified, viz.: (1) One G+2 Building at Boduppal, Hyderabad, valued at approximately Rs.40,00,000/-; (2) One Flat at KPHB Colony, Hyderabad, valued at approximately Rs.32,81,000/-; (3) Five plots, including two plots at Keesara and one plot each at Thungathurthy, Toopran and Suryapet, valued at approximately Rs.15,77,469/-; (4) Agricultural land admeasuring 3.21 acres, valued at approximately Rs.8,00,000/-; (5) Net cash of Rs.10,03,640/-; (6) LIC and Max Life savings amounting to approximately Rs.19,86,104/-; (7) Three four-wheelers and two two-wheelers, valued at approximately Rs.40,00,000/-; (8) Post Office Savings amounting to approximately Rs.20,86,175/-; (9) Gold ornaments weighing 629 grams, valued at approximately Rs.27,23,430/-; (10) Household articles valued at approximately Rs.10,67,740/-; and (11) Bank balances in three accounts amounting to approximately Rs.71,27,619/-.

During the course of searches and preliminary enquiry, based on the information available in the mobile phone of Sri Samanuri Yadaiah, Driver of the accused officer, and the transaction details examined so far, it was prima facie found that an amount of approximately Rs.24.60 lakh was transferred through multiple transactions from the bank account of the driver to the bank account of the daughter of the accused officer. During the course of enquiry, the driver has stated that the said amount was allegedly collected from persons involved in sand transportation and related activities and transferred to the account of the daughter of the accused officer. Further investigation is underway to verify the source, nature and purpose of the said transactions and the alleged illegal gratification.

The total value of the assets identified so far is approximately Rs.3,06,53,177/- (Rupees Three Crore Six Lakh Fifty-Three Thousand One Hundred and Seventy-Seven only). Further verification regarding additional assets is underway. The market value of the above immovable properties is expected to be much higher than their official/document value.

The investigation is under progress.

CELL PHONE NUMBER - 1064 (TOLL FREE NUMBER)

**ఇసుక అక్రమ రవాణా ఆరోపణలపై దృష్టి**

జయరాజు ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నట్లు సమాచారం. అయితే ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న కొందరితో ఆయనకు సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు గతంలో పలుమార్లు వచ్చాయి. అక్రమ ఇసుక రవాణా వ్యవహారాల ద్వారా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారా? అనే కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం వరకు సోదాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తనిఖీలు పూర్తయిన తర్వాత జయరాజుకు సంబంధించిన ఆస్తులు, ఆదాయ వివరాలు, అక్రమాస్తులపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి

హనుమకొండ కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాకు హరీశ్‌రావు మద్దతు తెలిపారు. అనంతరం పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు అరెస్ట్‌తో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. జిల్లాలో పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద భారీగా పోలీసులు మోహరించి విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించారు. విద్యార్థి నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు జీవో 97 రద్దు చేసే వరకు విద్యార్థుల పోరాటానికి మద్దతుగా ఉంటామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. విద్యార్థులపై కేసులు, అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరని బీఆర్ఎస్ నేతలు అన్నారు.

# ఓయూకు రూపాయి ఇచ్చారా?

- పోలీస్ పాలనతో ఏం సాధిస్తారు?
- పాలిటెక్నిక్ విద్యార్థులకి బీజేపీ మద్దతు



రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న తనతో పాటు పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమని మండిపడ్డారు. విద్యార్థుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం వారిని అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఈసెట్ ద్వారా ఉన్నత విద్యకు వెళ్లే అవకాశాలను దూరం చేసే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**జీవో 97 రద్దు చేయాల్సిందే**

పాలిటెక్నిక్ కోర్సులు కూడా స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగమేనని, విద్యార్థులు బీటెక్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయకుండా జీవో 97ను బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఓయూకు రూ.1,000 కోట్లు ఇస్తామని ప్రకటించి ఏడాది గడిచినా ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.15 వేల కోట్లకు చేరాయని విమర్శించారు. యంగ్ ఇండియా స్కూళ్లపై కూడా ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను రద్దు చేసి వాటి భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ చివరి వరకు రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయంగా ఉపయోగించబోమని, నైతికంగా అండగా నిలుస్తామని తెలిపారు.

# జిందాల్ వర్సిటీలో కేటీఆర్ లెక్చర్

- విద్యార్థులతో ముఖాముఖికి పిలుపు
- డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్‌కు ఆహ్వానం



. కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టి 2026 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు యూనివర్సిటీ తెలిపింది. కేటీఆర్ తన రాజకీయ అనుభవం, ప్రజా విధానాలపై ఆలోచనలు, తెలంగాణ అభివృద్ధి వంటి అంశాలను విద్యార్థులతో పంచుకునే అవకాశం ఉందని వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి.

**రాజ్యాంగ మ్యూజియం సందర్శనకు ఆహ్వానం**

కేటీఆర్‌ను యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. గతంలో రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు అందిన ఆహ్వానం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆహ్వానాన్ని కేటీఆర్ స్వీకరించి విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలు పంచుకుంటారని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమం జరిగితే జాతీయ స్థాయిలో కేటీఆర్‌కు మరో కీలక వేదికగా నిలిచే అవకాశం ఉంది.

# జన్‌ధన్ ఖాతాల్లో భారీగా డిపాజిట్లు




దేశవ్యాప్తంగా ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన కింద తెరిచిన బ్యాంకు ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17 లక్షల కోట్లకు చేరాయి. ఇప్పటివరకు 59 కోట్లకు పైగా జన్‌ధన్ ఖాతాలు ప్రారంభమైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పథకం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వివరాలను ప్రకటించింది. దేశంలో బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న పేద, సామాన్య ప్రజలను ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడంలో జన్‌ధన్ పథకం కీలకంగా మారిందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ తెలిపారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. 56 శాతం ఖాతాలు మహిళల పేర్లపై ఉండటం ప్రత్యేకతగా నిలిచింది. ఖాతాదారులకు ఇప్పటివరకు 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేశారు. ఉచిత ప్రమాద బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కూడా అందుతున్నాయి.

**ప్రభుత్వ పథకాల సొమ్ము నేరుగా ఖాతాల్లోకి**

జన్‌ధన్ ఖాతాల ద్వారా బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా ప్రజలకు చేరుతున్నాయి. కనీస నిల్వ అవసరం లేకుండానే ఖాతాలను నిర్వహించుకునే అవకాశం ఉంది. అర్హత ఉన్న ఖాతాదారులకు రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్‌ధన్-ఆధార్-మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. 2014 ఆగస్టు 28న ప్రారంభించిన ఈ పథకం ప్రధాన లక్ష్యం దేశంలోని ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా అందుబాటులోకి తీసుకురావడం. ప్రజలు సురక్షితంగా పొదుపు చేసుకోవడం, అవసరమైనప్పుడు బ్యాంకు రుణాలు పొందడం ఈ ఖాతాల ద్వారా సులభమైంది. అయితే చెక్కు సౌకర్యం పొందాలంటే ఖాతాలో కనీస నిల్వ ఉండాలనే నిబంధన ఉంది. మొత్తంగా జన్‌ధన్ ఖాతాల్లో పెరుగుతున్న డిపాజిట్లు దేశంలో ఆర్థిక చేరిక విస్తరిస్తున్నదానికి సూచికగా కేంద్రం పేర్కొంది.

# కౌశిక్‌కు ఎథిక్స్ నోటీసులు

**కడియంపై వ్యాఖ్యలతో దుమారం**



హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగస్టు 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో విచారణ జరగనుంది. కౌశిక్‌పై వచ్చిన ఫిర్యాదును కమిటీ పరిశీలించనుంది. ఈ వ్యవహారంపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎథిక్స్ కమిటీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతోందని ఆరోపించారు. కౌశిక్ రెడ్డిని దోషిగా నిలబెట్టి చర్యలకు సిఫార్సు చేయాలనే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కమిటీ ఉనికిలో లేని సమయంలో కౌశిక్ వ్యవహారాన్ని ఎలా ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేశారని ప్రశ్నించారు. ఇదే అంశం కక్ష సాధింపు అనుమానాలకు కారణమవుతోందన్నారు.

**మంత్రుల వ్యాఖ్యలు ఎథిక్స్ పరిధిలోకి రావా?**

శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మందుల సామేల్ తదితరులు చేసిన తీవ్ర వ్యాఖ్యలు, బెదిరింపులు, అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ పరిధిలోకి రావా అని వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. తమ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను చూపుతూ అధికార పార్టీపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం శ్రీహరి అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారని తెలిపారు. ఈ అంశాన్ని రాజకీయ కక్షగా కాకుండా నిబంధనల ప్రకారం పరిశీలించాలని డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి వ్యవహారంపై చర్చించి చర్యలకు సిఫార్సు చేసే క్రమంలో ప్రభుత్వం న్యాయబద్ధమైన విధానాన్ని పాటించాలని కోరారు. దీంతో ఆగస్టు 29న జరగనున్న ఎథిక్స్ కమిటీ సమావేశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# డీలిమిటేషన్ అక్కర్లేదు

- లోక్‌సభలో 543 సీట్లు చాలు
- 25 ఏళ్ల పాటు సీట్లలో మార్పు వద్దు
- తేల్చి చెప్పిన ఏఐసీసీ చీఫ్ ఖర్గే

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలను మరో 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో కోరారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లో కూడా మార్పులు చేయవద్దని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే కీలక అంశమని పేర్కొన్న ఖర్గే.. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా అన్ని రాజకీయ పార్టీలతో వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై రాజకీయ పార్టీలు సమగ్రంగా చర్చించేందుకు తగిన సమయం ఇవ్వాలని సూచించారు. గతంలో రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోయిన విషయాన్ని గుర్తుచేస్తూ, అలాంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయొద్దని ఖర్గే కోరారు.

**2029 నుంచే మహిళలకు 33 శాతం**

డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్లను ముడిపెట్టడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు డిలిమిటేషన్ వల్ల అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని సూచించారు. ప్రస్తుత 543 స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చిచెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. డీలిమిటేషన్‌పై తాను జూలై 16న కూడా ప్రధానికి లేఖ రాసినా సానుకూల స్పందన రాలేదని, తాజా పరిణామాల నేపథ్యంలో మరోసారి లేఖ రాయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ అంశంపై విస్తృత రాజకీయ సంప్రదింపులు జరిపిన తర్వాతే కేంద్రం ముందుకు వెళ్లాలని ఖర్గే స్పష్టం చేశారు.



# ఈనాటి ఈ బంధం ఏనాటిదో

**నేటి జనరేషన్ చేతిలో ప్రపంచం ఉంది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న మనిషితో క్షణాల్లో వీడియో కాల్ చేయగలుగుతోంది. మెసేజ్ పంపితే నీలిరంగు టిక్‌తో సమాధానం వచ్చిందో లేదో కూడా తెలుసుకోవచ్చు. కానీ స్క్రీన్ మీద కనిపించే ముఖానికి, పక్కన కూర్చుని మనసు చదివే మనిషికి తేడా ఉంది. ఆ తేడా అన్నాచెల్లెళ్ల బంధంలో అసలు ఉండదు. ఎన్నాళ్లు మాట్లాడకపోయినా బంధం తగ్గదు. ఎంతగా తగువులాడినా ఆప్యాయత చావదు. "నాతో మాట్లాడకు" అని కోపంగా వెళ్లిపోయిన చెల్లే, అన్నకు చిన్న కష్టం వచ్చిందంటే ముందుగా ఫోన్ చేసేది. "నువ్వు చూసుకో" అని చెప్పే అన్నే, చెల్లి కన్నీరు చూస్తే తన సమస్యగా భావించేవాడు. ఇదొక విచిత్రమైన బంధం—దూరంగా ఉన్నా దగ్గరగా ఉంటుంది... మాటలేకున్నా మాట్లాడుతూనే ఉంటుంది.**

- **అన్నా చెల్లెళ్ల బంధానికి అప్ డేట్ ఉండదు**
- **రాఖీ పౌర్ణమి సందర్భంగా స్పెషల్ స్టోరీ**

**ఈనాటి ఈ బంధం ఏనాటిదో... పుట్టుకకు ముందే రాసుకున్న అనుబంధమేమో! ఒకే తల్లి ఒడిలో మొదలైన పరిచయం, జీవితాంతం మనసులో మిగిలే బంధంగా మారుతుంది. చిన్నప్పుడు అన్న చేతిలో చెల్లి చేయి... చెల్లి అల్లరిలో అన్న నవ్వు... ఒకరి మీద ఒకరు ఫిర్యాదులు, మళ్లీ కాసేపటికే కలిసిపోయే అమాయకత్వం—అదే బాల్యం. కానీ ఆ చిన్ననాటి గొడవల వెనుక ఎంతటి ప్రేమ దాగి ఉందో పెద్దయ్యాక తెలుస్తుంది. కాలం వాళ్లను వేర్వేరు దారుల్లో నడిపిస్తుంది. ఉద్యోగాలు, పెళ్లిళ్లు, బాధ్యతలు, నగరాలు, దేశాలు... దూరాలు పెరుగుతాయి. అయినా ఒక ఫోన్ కాల్‌లో "అన్నా?" అని అడిగిన మాటలోనే బాల్యం తిరిగి వచ్చేస్తుంది. ఇదే రక్తసంబంధం గొప్పతనం... ఇదే జన్మజన్మల సంబంధం.**

నేటి జనరేషన్ చేతిలో ప్రపంచం ఉంది. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న మనిషితో క్షణాల్లో వీడియో కాల్ చేయగలుగుతోంది. మెసేజ్ పంపితే నీలిరంగు టిక్‌తో సమాధానం వచ్చిందో లేదో కూడా తెలుసుకోవచ్చు. కానీ స్క్రీన్ మీద కనిపించే ముఖానికి, పక్కన కూర్చుని మనసు చదివే మనిషికి తేడా ఉంది. ఆ తేడా అన్నాచెల్లెళ్ల బంధంలో అసలు ఉండదు. ఎన్నాళ్లు మాట్లాడకపోయినా బంధం తగ్గదు. ఎంతగా తగువులాడినా ఆప్యాయత చావదు. "నాతో మాట్లాడకు" అని కోపంగా వెళ్లిపోయిన చెల్లే, అన్నకు చిన్న కష్టం వచ్చిందంటే ముందుగా ఫోన్ చేసేది. "నువ్వు చూసుకో" అని చెప్పే అన్నే, చెల్లి కన్నీరు చూస్తే తన సమస్యగా భావించేవాడు. ఇదొక విచిత్రమైన బంధం—దూరంగా ఉన్నా దగ్గరగా ఉంటుంది... మాటలేకున్నా మాట్లాడుతూనే ఉంటుంది.

### రాఖీ దారం కాదు.. బంధమే బలం

రాఖీ పౌర్ణమి ఆ బంధానికి ఒక పండుగ పేరు మాత్రమే. అసలు పండుగ రాఖీ కట్టే ఆ క్షణంలో కాదు... అన్నాచెల్లెళ్లు ఒకరినొకరు గుర్తుచేసుకునే ఆ క్షణంలో మొదలవుతుంది. ఒకప్పుడు చెల్లి రాఖీ కట్టి అన్న చేతికి మిఠాయి పెట్టేది. ఇప్పుడు అదే చెల్లి మరో నగరంలో ఉండొచ్చు, మరో దేశంలో ఉండొచ్చు. కొరియర్‌లో రాఖీ పంపొచ్చు... వీడియో కాల్‌లో రాఖీ చూపించొచ్చు... డిజిటల్ గిఫ్ట్ పంపొచ్చు. మారింది పద్ధతి మాత్రమే; మారనిది భావం. రాఖీ ఒక దారం కాదు... "నువ్వున్నావనే ధైర్యం నాకు ఉంది" అనే నమ్మకం. అన్నకు చెల్లి అంటే బాధ్యత మాత్రమే కాదు... తన బాల్యానికి మిగిలిన చివరి చిరునామా. చెల్లికి అన్న అంటే రక్షణ మాత్రమే కాదు... తండ్రి తర్వాత కూడా తనవైపు నిలబడే ఒక నమ్మకమైన నీడ.




### కాలం మార్చినా బాల్యం మార్చని బంధం

జీవితం అందరినీ పెద్దవాళ్లను చేస్తుంది... కానీ అన్నాచెల్లెళ్ల బంధం మాత్రం మనలోని చిన్నపిల్లాడిని, చిన్నపిల్లను బతికిస్తుంది. ప్రపంచం మనల్ని మన విజయాలతో కొలుస్తుంది. జీతం ఎంత? ఉద్యోగం ఏంటి? ఇల్లు ఎక్కడ? కారు ఏది? అంటూ ప్రశ్నిస్తుంది. కానీ అన్నకు చెల్లి మాత్రం "నువ్వు చిన్నప్పుడు ఇలా చేసేవాడివి గుర్తుందా?" అని అడుగుతుంది. చెల్లికి అన్న మాత్రం "నువ్వు అప్పుడెంత అల్లరి చేసేదానివో తెలుసా?" అంటూ నవ్విస్తాడు. ప్రపంచం మర్చిపోయిన మన గతాన్ని గుర్తుపెట్టుకునే మనుషులు వాళ్లే. అందుకే అన్నాచెల్లెళ్ల అనుబంధం కేవలం బంధుత్వం కాదు... మన జీవితానికి మనమే మరిచిపోయిన ఒక అద్దం. అందులో మన వయసు కనిపించదు... మన బాల్యం కనిపిస్తుంది.



### తరాలు మారినా చెరగని అన్నాచెల్లెళ్ల బంధం

తరాలు మారుతాయి... ట్రెండ్లు మారతాయి... సంబంధాలను నిర్వచించే పద్ధతులు మారతాయి. కానీ కొన్ని బంధాలకు ఎప్పటికీ "అప్‌డేట్" అవసరం లేదు. అన్నా చెల్లెళ్ల అనుబంధం అలాంటిదే. చిన్నప్పుడు బొమ్మ కోసం కొట్టుకున్న చేతులే, పెద్దయ్యాక కష్టంలో ఒకరినొకరు పట్టుకుంటాయి. ఒకప్పుడు ఇంట్లో చివరి చాక్లెట్ కోసం పోటీ పడిన వాళ్లే, ఇప్పుడు ఒకరి కోసం మరొకరు తమ సమయాన్ని, డబ్బును, ఆనందాన్ని కూడా పంచుకుంటారు. రాఖీ పౌర్ణమి మనకు చెప్పే అసలు సందేశం ఇదే—జీవితంలో ఎంతమంది వచ్చినా, వెళ్లినా, పుట్టుకతో వచ్చిన కొన్ని బంధాలకు ప్రత్యామ్నాయం ఉండదు. నాటి ఈ బంధం ఏనాటిదో తెలియదు... కానీ ఏనాటికీ చెరిగి పోదు. అన్నా చెల్లెళ్ల అనుబంధం... జన్మజన్మల సంబంధం. అన్నా చెల్లెళ్ళ బంధానికి అప్ డేట్ లేదు.. ఉండదు కూడా..

# ఆటో డ్రైవర్లకు గుడ్‌న్యూస్

- **రూ.200 కోట్లతో ఈవీ ఆటోలు**



తెలంగాణ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఊరటనిచ్చే కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026' అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకానికి సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆమోదం తెలిపిన నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా జీవో జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఇంధన ధరలు పెరగడం, వాహనాల నిర్వహణ ఖర్చులు అధికం కావడంతో రోజువారీ ఆదాయంపై ప్రభావం పడుతున్న ఆటో డ్రైవర్లకు ఈ నిర్ణయం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ముఖ్యంగా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగాన్ని పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.

### ఖర్చు తగ్గితే డ్రైవర్లకు లాభం

పెట్రోల్, డీజిల్ కోసం ప్రతిరోజూ చేసే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రిక్ ఆటోల నిర్వహణ వ్యయం తక్కువగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఆటో డ్రైవర్ల రోజువారీ నిర్వహణ భారం తగ్గి, దీర్ఘకాలంలో ఆదాయంపై సానుకూల ప్రభావం పడే అవకాశం ఉంది. ఇంధన ధరల పెరుగుదల నుంచి కొంత రక్షణ కల్పించడంతో పాటు పర్యావరణహిత రవాణాకు ప్రోత్సాహం లభించనుంది. అయితే రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఈవీలుగా మార్చే ప్రక్రియను ప్రభుత్వం ఏ విధంగా అమలు చేస్తుంది, లబ్ధిదారుల ఎంపిక ఎలా ఉంటుంది, ఒక్కో ఆటోకు ఎంత మేర ప్రయోజనం అందుతుంది వంటి అంశాలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఆటో డ్రైవర్లకు ఆర్థిక ఉపశమనం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంపు అనే రెండు లక్ష్యాలతో ఈ పథకం అమలు కానుంది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని వేలాది ఆటో డ్రైవర్లు ఈ పథకం అమలు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# ఫోన్ వద్దని మందలింపు..

- **ఇంటర్ బాలిక విషాదాంతం**
- **ఒక్క మాట.. కుటుంబానికి తీరని శోకం**
- **కళ్లముందే కూతురు దూరమై తండ్రి ఆవేదన**

పిల్లలపై తల్లిదండ్రులు చూపించే మందలింపు ప్రేమలో భాగమే. కానీ ఆ క్షణంలో పిల్లల మనసులో ఏ తుఫాను నడుస్తుందో చాలాసార్లు పెద్దలకు తెలియదు. హైదరాబాద్‌లో జరిగిన ఈ విషాద ఘటన అలాంటి భయంకరమైన పరిస్థితినే కళ్లముందు నిలిపింది. ఫోన్ ఎక్కువగా ఉపయోగించొద్దని తండ్రి మందలించిన మాట.. ఓ కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చింది. అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇంటర్ విద్యార్థిని తిరిగి ఇంటికి రాలేదు. తెల్లవారేసరికి ఆమె గురించి వచ్చిన వార్త తల్లిదండ్రుల గుండెలను బద్దలు కొట్టింది. తమ కళ్లముందే పెరిగిన కూతురు ఇక లేదన్న నిజాన్ని ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. చదువుకుని జీవితంలో ఎదగాల్సిన వయసులో ఇలాంటి విషాదం చోటుచేసుకోవడం స్థానికులను సైతం కలచివేసింది. ఒక్క మందలింపు ఇంతటి విషాదానికి దారితీయడం ప్రతి తల్లిదండ్రినీ ఆలోచింపజేస్తోంది. పిల్లల ప్రవర్తనపై ఆందోళన ఉంటే కోపంతో కాకుండా ప్రశాంతంగా మాట్లాడటం ఎంత ముఖ్యమో ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.

### ఫోన్ విషయంలో తండ్రి మందలింపు

హైదరాబాద్ ఛత్రినాకలో నివసించే శ్రీనివాస్ కుమార్తె తేజస్వి(17) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమె తరచూ ఫోన్‌లో ఎక్కువ సమయం గడుపుతోందని గమనించిన తండ్రి, అర్ధరాత్రి వరకు ఫోన్‌లో మాట్లాడటం మంచిది కాదని మందలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయంలో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఆ తర్వాత అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన బాలిక.. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో ఆమె మృతదేహాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. క్షణాల్లో తమ కూతురిని కోల్పోయిన కుటుంబం కన్నీరుమున్నీరైంది.

### తల్లిదండ్రులకు తీరని గాయం

సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాదం వెనుక ఉన్న పూర్తి పరిస్థితులను పోలీసులు పరిశీలిస్తున్నారు. పిల్లలతో సంభాషణలో మాటలకంటే వారి మనసును అర్థం చేసుకోవడం ముఖ్యమన్న సందేశాన్ని ఈ ఘటన ఇస్తోంది. చిన్న విషయాలపై పిల్లలు తీవ్రంగా స్పందిస్తున్నట్లు కనిపిస్తే వారిని ఒంటరిగా వదిలేయకుండా దగ్గరగా మాట్లాడటం అవసరం. కోపం తగ్గిన తర్వాత సమస్యను చర్చించడం, వారి భావాలను వినడం తల్లిదండ్రుల బాధ్యత. ఒక క్షణిక ఆవేదన జీవితాంతం కుటుంబాన్ని కన్నీళ్లలో ముంచకూడదు. పిల్లలు తీవ్రంగా బాధపడుతున్నట్లు కనిపిస్తే వెంటనే నమ్మకమైన పెద్దలను, ఉపాధ్యాయులను లేదా మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతు



- **ఆచూకీపై పెరుగుతున్న ఆందోళన**

నేపాల్‌లో సంభవించిన భయానక మెరుపు వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల్లో కనీసం 288 మంది భారతీయులు ఇంకా ఆచూకీ లేకుండా ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. గల్లంతైన వారిలో జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న కార్మికులు, పర్యాటక బృందాలకు చెందినవారు ఉన్నారు. వీరిలో త్రిశూలి వన్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది భారతీయులు కూడా ఉన్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం ప్రాజెక్టు యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతూ వారి వివరాలు సేకరిస్తోంది. ఇదే సమయంలో టిబెట్‌లో ఉన్న సుమారు 200 మంది భారతీయులు కూడా భారత్ నుంచి సహాయం కోరినట్లు కేంద్రం తెలిపింది.

### 21 మంది యాత్రికుల సురక్షిత రక్షణ

నేపాల్‌లో చిక్కుకున్న భారతీయులను రక్షించే చర్యలు కొనసాగుతున్నాయి. కైలాస్ మానస సరోవర్ యాత్రకు వెళ్లిన తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు విదేశాంగ శాఖ ప్రకటించింది. మరోవైపు నేపాల్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య గురువారం నాటికి 270కి చేరింది. వేలాది మంది గల్లంతైనట్లు స్థానిక అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ పరిస్థితిని అత్యంత సీరియస్‌గా పరిగణిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే నేపాల్ ప్రధానమంత్రితో మాట్లాడి అవసరమైన సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కంటే నేపాల్ కోరిన మేరకు మానవతా సహాయం అందించడంపైనే భారత్ దృష్టి పెట్టింది అని జైస్వాల్ స్పష్టం చేశారు.

### బెయిలీ వంతెనల ఏర్పాటుకు చర్యలు

వరదల కారణంగా రహదారులు, వంతెనలు దెబ్బ తినడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాలకు రాకపోకలు పునరుద్ధరించేందుకు బెయిలీ వంతెనలను సమీకరించే పనిలో భారత్ ఉంది. వరద ప్రాంతాల్లో తాత్కాలికంగా రెండు ప్రాంతాలను కలిపేందుకు వీటిని వేగంగా ఏర్పాటు చేయవచ్చు. అయితే నేపాల్ నుంచి జాతీయ విపత్తు స్పందన దళం, భారత సైన్యంలోని ఇంజినీరింగ్ విభాగాన్ని పంపాలంటూ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక అభ్యర్థన తమకు అందలేదని విదేశాంగ శాఖ తెలిపింది. భారత్ అవసరమైన ప్రతి సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని కేంద్రం స్పష్టం చేసింది. నేపాల్‌లో చిక్కుకున్న భారతీయుల ఆచూకీ కోసం దౌత్య కార్యాలయం స్థానిక అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తోంది.

## నేపాల్ విలయం...
# భారత్‌కు మరో ముప్పు!

### చైనా డ్యామ్‌తో ఈశాన్యానికి పెను ప్రమాదం

నేపాల్‌లో జరిగిన జలవిలయం తర్వాత భారత్‌కూ ఇలాంటి ప్రమాదం పొంచి ఉందన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా టిబెట్‌లో బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ జలవిద్యుత్ ప్రాజెక్ట్‌పై నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మపుత్రను టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బోగా పిలుస్తారు. ఈ నదిపై చైనా సుమారు 167 బిలియన్ డాలర్ల వ్యయంతో మెగా ప్రాజెక్ట్ చేపడుతోంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద త్రీగోర్జెస్ డ్యామ్ కంటే దాదాపు మూడు రెట్లు పెద్దదిగా ఉంటుందని అంచనా. ఏటా సుమారు 60 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ భారీ నిర్మాణం జరుగుతున్న ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు ఆందోళనగా మారింది.

- **భూకంప ప్రాంతంలో భారీ నిర్మాణం**

చైనా జియలాజికల్ సర్వే ఆధ్వర్యంలో జరిగిన అధ్యయనంలో ప్రాజెక్టు ప్రాంతం కింద పైజెన్ ఫాల్ట్ అనే భౌగోళిక పగులు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ పగుళ్లు డ్యామ్‌తో పాటు రోడ్లు, వంతెనలు, సొరంగాలు వంటి నిర్మాణాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టిబెట్ ప్రాంతం తరచూ భూకంపాలకు గురయ్యే ప్రాంతం కావడంతో ప్రమాదం మరింత పెరుగుతోంది. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత భారీ భూకంపం సంభవిస్తే పరిస్థితిని ముందుగానే అంచనా వేయడం కష్టమవుతుందని నిపుణులు చెబుతున్నారు. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టును సాధారణ ఆనకట్టగా కాకుండా 'వాటర్ బాంబ్'గా అభివర్ణిస్తున్నారు. చైనా శాస్త్రవేత్తల్లో కూడా ఈ నిర్మాణంపై ఆందోళనలు ఉన్నట్లు సమాచారం.

- **నీరు ఆపినా.. వదిలినా ముప్పే**

బ్రహ్మపుత్రపై ఆధారపడి అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్‌తో పాటు ఈశాన్య ప్రాంతాల్లో కోట్లాది మంది జీవిస్తున్నారు. ఇప్పటికే ప్రతి ఏటా ఈ నది వరదలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పుడు చైనా డ్యామ్ కారణంగా ఒక్కసారిగా భారీ నీటిని విడుదల చేస్తే వరద విలయం, నీటిని ఎక్కువకాలం నిల్వ చేస్తే దిగువ ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. భారత్‌చైనా మధ్య నదీజల వివాదాలపై బలమైన సమాచార మార్పిడి వ్యవస్థ లేకపోవడం మరో ఆందోళన. ప్రస్తుతం ప్రవాహం, వర్షపాతం వంటి వివరాల కోసం ఉన్న అవగాహనా ఒప్పందం కూడా కాలానుగుణంగా పునరుద్ధరించాల్సి ఉంటుంది. చైనా భవిష్యత్తులో ఆ ఒప్పందాన్ని కొనసాగించకపోతే ప్రమాద సమయంలో ముందస్తు సమాచారం భారత్‌కు అందకపోవచ్చన్న భయం ఉంది. ఈ నేపథ్యంలో చైనా ప్రాజెక్టుకు ప్రతిస్పందనగా భారత్ 11 వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఎగువ నుంచి వచ్చే నీటిని నియంత్రించడంతో పాటు సంభావ్య వరద ప్రభావాన్ని తగ్గించడమే దీని ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. నేపాల్ విపత్తు ఇచ్చిన హెచ్చరిక ఒక్కటే — ప్రకృతి ప్రమాదాల కంటే ముందే సమాచార వ్యవస్థలు, రక్షణ ప్రణాళికలు సిద్ధంగా ఉండాలి.



# ఊళ్లకు ఊళ్లే గల్లంతు

### జలప్రళయం మిగిల్చిన విధ్వంసం

నేపాల్‌లో సంభవించిన భారీ మెరుపు వరదలు భారీ ప్రాణనష్టం, అపార ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదులు ఉప్పొంగడంతో నదీతీర గ్రామాలు, పట్టణాలు నీటి ఉద్ధృతిలో చిక్కుకున్నాయి. ఇళ్లు, మార్కెట్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. వరద అనంతరం తీసిన ఏరియల్ దృశ్యాల్లో ఒకప్పుడు జనసంచారంతో కనిపించిన ప్రాంతాలు ఇప్పుడు బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని గ్రామాల ఆనవాళ్లు కూడా కనిపించని స్థాయిలో విధ్వంసం జరిగింది. ఇళ్ల కింది అంతస్తులు బురదలో కూరుకుపోయాయి. ప్రజలతో పాటు పర్యాటకులు కూడా వరద ప్రవాహంలో గల్లంతయ్యారు. ఎంతమంది ఎక్కడ కొట్టుకుపోయారనే పూర్తి లెక్క ఇప్పట్లో తేలే పరిస్థితి కనిపించడం లేదు. రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో సహాయక బృందాలు బాధిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది.

### భూకంపం కాదు.. హిమనీ సరస్సు బద్దలే

తొలుత ఈ జలప్రళయానికి హిమాలయ ప్రాంతంలో సంభవించిన భూకంపమే కారణమని వార్తలు వచ్చాయి. అయితే తాజా విశ్లేషణలో అసలు కారణం హిమనీ సరస్సు బద్దలవడం అని అమెరికా జియాలాజికల్ సర్వే వెల్లడించింది. పర్వత ప్రాంతాల్లో భారీ మంచు చరియలు, రాళ్లు విరిగిపడటంతో లిండే నది ఉప్పొంగి భోటే కోషిలోకి ఒక్కసారిగా వరద ప్రవాహం దూసుకొచ్చినట్లు నిపుణులు తెలిపారు. శాటిలైట్ దృశ్యాల్లో కూడా భారీ మంచు, రాళ్ల చరియలు కదిలిన ఆనవాళ్లు కనిపించాయి. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషణ ప్రకారం జలప్రళయానికి సుమారు ఏడు నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయి. ఆ ప్రకంపనలు కొండచరియలు విరిగిపడటంతో ఏర్పడ్డాయని తాజా అంచనాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు 157 మంది మృతి, వందలాది మంది గల్లంతు అయినట్లు సమాచారం. టిబెట్ వైపు ముగ్గురు మరణించగా, 553 మందికి పైగా గల్లంతైనట్లు తెలుస్తోంది.

### హెచ్చరిక అందకపోవడంపై నేపాల్ ఆగ్రహం

ఈ విపత్తులో ప్రకృతి విలయంతో పాటు సమాచార లోపం కూడా కీలక సమస్యగా కనిపిస్తోంది. టిబెట్‌లోని కెరుంగ్ ప్రాంతంలో ఉదయం 8.15 గంటల సమయంలో వరదలు సంభవించినట్లు సమాచారం. దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు ఈ విషయం తెలిసింది. స్థానికుల నుంచి సమాచారం అందిన తర్వాతే నేపాల్ విపత్తు నిర్వహణ యంత్రాంగం అప్రమత్తమైంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చైనా నుంచి అధికారిక సమాచారం చేరింది. భోటే కోషి, త్రిశూలి నదులకు ముప్పు ఉందని అప్పటికి హెచ్చరించారు. టిబెట్‌లో ప్రమాదాన్ని ముందుగానే గుర్తించినా నేపాల్‌ను వెంటనే అప్రమత్తం చేయలేదని అక్కడి అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే ఇరు దేశాల మధ్య ఇలాంటి విపత్తులపై ముందస్తు సమాచార మార్పిడికి స్పష్టమైన అధికారిక ఒప్పందం లేకపోవడంతో చైనాను నేరుగా బాధ్యుడిగా చేయలేమని నిపుణులు చెబుతున్నారు. ప్రకృతిని అడ్డుకోవడం సాధ్యం కాకపోయినా ముందస్తు హెచ్చరికలతో ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చన్న గట్టి సందేశాన్ని నేపాల్ విషాదం మరోసారి గుర్తు చేస్తోంది.

# నేపాల్‌ను ముంచిన 'మట్టి సునామీ'

- **మంచుకొండ కూలి.. 170 కి.మీ వరద బీభత్సం**
- **క్షణాల్లో విరుచుకుపడిన విపత్తు**

నేపాల్‌లో సంభవించిన ఘోర విపత్తు వెనుక భారీ మంచురాతి కొండచరియ విరిగిపడటమే ప్రధాన కారణమై ఉండొచ్చని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. కొండపై నుంచి దూసుకొచ్చిన ఈ భారీ భూస్ఖలనం మార్గంలో ఉన్న మంచు, నీరు, రాళ్లు, చెట్లు, మట్టిని తనతో కలుపుకుంది. భోటే కోషి నదీ లోయలో ఈ విధ్వంసక ప్రవాహం 170 కిలోమీటర్లకు పైగా దూసుకెళ్లింది. ఈ ప్రాంతం కాఠ్‌మాండు నుంచి టిబెట్‌లోని లాసాకు వెళ్లే కీలక మార్గం కావడంతో నష్టం మరింత తీవ్రంగా మారింది. 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గల్లంతయ్యారు. కనీసం 34 మంది ఆస్ట్రేలియన్లు కూడా ఆచూకీ లేకుండా పోయారు. భారీ భూస్ఖలనం సృష్టించిన భూకంప తరంగాలు సీస్మోగ్రాఫ్‌లలో 4.4 తీవ్రతతో నమోదవడంతో తొలుత దీనిని భూకంపంగా భావించారు. గ్యిరోంగ్ పోర్ట్ చేరేసరికి ఈ ప్రవాహం సుమారు 30 మీటర్ల ఎత్తైన మట్టి సునామీలా మారింది.

### హిమనదం కూలడమే కారణమా?

సాధారణంగా హిమనద సరస్సు గట్టు తెగిపోతే భారీగా నీరు ఒక్కసారిగా విడుదలై వరదలు వస్తాయి. 2024లో నేపాల్‌లో ఇలాంటి గ్లేసియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ సంభవించింది. అయితే ప్రస్తుత ఘటనకు అలాంటి సరస్సు విరిగిపోవడం కారణం కాదని ఉపగ్రహ చిత్రాల ప్రాథమిక విశ్లేషణ సూచిస్తోంది. కొండచరియలు హిమనదంలోని పెద్ద భాగాలను తొలగించి, చివరకు మంచుకొండ కూలిపోయే పరిస్థితి ఏర్పడి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. అసలు హిమనదం ఎందుకు కూలిందనే విషయం ఇంకా స్పష్టంగా తెలియలేదు. అయితే ప్రపంచవ్యాప్తంగా హిమనదాలు వేగంగా కరుగుతున్న విషయం మాత్రం స్పష్టమే. ముఖ్యంగా హిమాలయాల్లో ప్రమాదం మరింత ఎక్కువ. అక్కడి ఎత్తైన పర్వతాల అడుగుభాగంలో శాశ్వత మంచుతో గడ్డకట్టిన నేల, రాళ్లు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఈ పెర్మాఫ్రాస్ట్ కరుగుతోంది. దాంతో రాళ్లు, మట్టిని బిగించి ఉంచే సహజ బలం తగ్గి కొండచరియలు, రాళ్ల పతనం, ఆకస్మిక వరదలకు అవకాశం పెరుగుతోంది.

### ముందస్తు హెచ్చరికలే ప్రాణరక్షణ

ఇలాంటి విపత్తులను పూర్తిగా అడ్డుకోవడం సాధ్యం కాకపోయినా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ప్రాణాలను కాపాడగలవు. నదుల్లో నీటి మట్టం వేగంగా పెరగడం, భారీ వర్షాలు, భూకంప తరంగాలను పర్యవేక్షించి ప్రమాదానికి ముందే ప్రజలను అప్రమత్తం చేయవచ్చు. స్విట్జర్లాండ్‌లో హిమనదం కూలిన ఘటనలో ముందస్తు హెచ్చరికలు, ప్రజల తరలింపు వల్ల ఒక్క ప్రాణం కూడా పోలేదు. నేపాల్‌లో ఇలాంటి వ్యవస్థల కోసం అంతర్జాతీయంగా నిధులు కూడా కేటాయిస్తున్నారు. మరోవైపు హిమాలయ హిమనదాల కరుగుదల నేపాల్, భారత్, పాకిస్థాన్, చైనాలోని బిలియన్ల మంది ప్రజల నీటి భద్రతతో ముడిపడి ఉంది. ప్రారంభంలో మంచు కరగడం నదీ ప్రవాహాలను పెంచి వరద ముప్పును పెంచవచ్చు. హిమనదాలు మరింత చిన్నవైతే భవిష్యత్తులో ఎండాకాలంలో నీటి లభ్యత తగ్గే ప్రమాదం ఉంది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల తగ్గింపు, ప్రమాదకర ప్రాంతాల నిరంతర పర్యవేక్షణ, బలమైన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలే భవిష్యత్ ప్రాణనష్టాన్ని తగ్గించే కీలక మార్గాలు.



## హైదరాబాద్‌లో లక్ష మట్టి గణేశులు ఉచితం

**పర్యావరణహిత ఉత్సవాలకు జీహెచ్ఎంసీ పిలుపు**

హైదరాబాద్‌లో ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ కీలక చర్యలు చేపడుతోంది. నిమజ్జనం సమయంలో నీటి వనరులు కలుషితం కాకుండా నగరవ్యాప్తంగా లక్ష మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. సెప్టెంబర్ రెండో వారంలో జీహెచ్ఎంసీ సర్కిల్, జోనల్ కార్యాలయాల ద్వారా విగ్రహాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. భక్తులతో పాటు కాలనీ సంక్షేమ సంఘాలు, గణేష్ మండపాల నిర్వాహకులు కూడా వీటిని పొందే అవకాశం కల్పించారు. మొత్తం లక్ష మట్టి విగ్రహాలను మూడు పరిమాణాల్లో తయారు చేస్తున్నారు. ఇందులో 70 వేల విగ్రహాలు 8 అంగుళాలు, 20 వేల విగ్రహాలు ఒక అడుగు, 10 వేల విగ్రహాలు 1.5 అడుగుల ఎత్తులో సిద్ధం చేయనున్నారు. మట్టి విగ్రహాలతో నిమజ్జనం నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## 3 నెలల్లో రూ.9.34 లక్షల హుండీ ఆదాయం

**అగస్త్యేశ్వర స్వామి ఆలయ హుండీల లెక్కింపు**



ప్రొద్దుటూరు: స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఏడాది మూడు నెలల కాలానికి హుండీల ద్వారా మొత్తం రూ.9,34,929 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. రామేశ్వరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి కె.వి. రమణ ఆధ్వర్యంలో లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



## వరుస దొంగతనాల కేసు ఛేదించిన పోలీసులు

**భట్టిప్రోలులోఇద్దరు నిందితులు అరెస్ట్.. రూ.4.65 లక్షల సొత్తు సీజ్**

భట్టిప్రోలు, ఆగస్టు 27: భట్టిప్రోలులో జరిగిన వేర్వేరు దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4.65 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. వైన్ షాప్, మెడికల్ షాపుల్లో చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగ బొట్టా మణికంఠరెడ్డి(31)ను అరెస్ట్ చేసి రూ.25 వేల నగదు, రూ.90 వేల విలువైన బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో 45 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించిన జంగం సతీష్(22)ను కూడా అరెస్ట్ చేసి రూ.3.50 లక్షల విలువైన నగలను సీజ్ చేశారు. కేసులు ఛేదించిన పోలీసులను అధికారులు అభినందించారు.

## వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

**భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు**




అమెరికాలో చదువు, ఉద్యోగం, కెరీర్ కోసం వెళ్లాలనుకునే భారతీయులకు వీసా అపాయింట్‌మెంట్ల మార్పుతో కొత్త అనిశ్చితి ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని వీసా అపాయింట్‌మెంట్లను తాత్కాలికంగా నిలిపివేసి, రీషెడ్యూల్ చేయనున్నట్లు అమెరికా ప్రకటించింది. కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ ఇవ్వడంతో ఈ మార్పులు చోటుచేసుకున్నట్లు సమాచారం. దరఖాస్తుదారులపై మరింత క్షుణ్ణంగా పరిశీలన, అమెరికా ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశాన్ని అంచనా వేయడంపై శిక్షణ ఇస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొందరి అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీలను తర్వాత వెల్లడించనున్నట్లు సమాచారం. హెచ్1బీ ఆమోదాల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైగా ఉండగా, అమెరికా వర్సిటీల్లో 3.30 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు ఉన్నారు. దీంతో ఆలస్యాలు విద్యార్థుల జాయినింగ్ తేదీలు, ఉద్యోగ ఆఫర్లు, రీలొకేషన్ ప్రణాళికలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే ఎఫ్1, హెచ్1బీ వీసాల జారీ పూర్తిగా నిలిపివేయలేదని స్పష్టమవుతోంది.




## మన ఊరు.. మన బాధ్యత.. మన అభివృద్ధి

**పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి పిలుపు**

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని మోరి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కొండా సత్తిబాబు కోరారు. ఏ పార్టీకి చెందిన వారైనా గ్రామ అవసరాల కోసం ఐకమత్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డ్రైనేజీ, తాగునీరు, వీఆర్వో కార్యాలయం, గాంధీ పార్కు అభివృద్ధి, స్మార్ట్ విలేజ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పునర్నిర్మాణం వంటి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను మెరక చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. గ్రామాభివృద్ధికి అధికారంలో ఉండటం అవసరమని, అవకాశం కల్పిస్తే ఎమ్మెల్యే సహకారం, ప్రభుత్వ తోడ్పాటుతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజల అండదండలతో అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ, ఆగస్టు 15న గ్రామాభివృద్ధికి ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు.

# పుట్టింటికి రా చెల్లి..

**ఆ ఇద్దరు అన్నలకు..**
**చెల్లెళ్లు రాఖీ కడతారా?**



రాఖీ పౌర్ణమి వచ్చిందంటే అన్నాచెల్లెళ్ల అనుబంధం గుర్తుకొస్తుంది. కానీ ఈసారి రెండు తెలుగు రాష్ట్రాల్లో రాఖీ పండుగకు రాజకీయ రంగు కూడా పులుముకుంది. తెలంగాణలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన సోదరి కవిత మధ్య రాజకీయ దూరం ఇప్పటికే స్పష్టమైంది. తండ్రి కేసీఆర్ నేతృత్వంలోని పార్టీకి దూరంగా కవిత సొంత రాజకీయ వేదికతో ప్రజాక్షేత్రంలోకి వచ్చారు. ఒకే కుటుంబం.. ఒకే రక్తం.. కానీ రాజకీయంగా మాత్రం ఎడమొఖం పెడమొఖంగా కనిపిస్తున్న పరిస్థితి. అలాంటి సమయంలో రాఖీ పండుగనాడు కవిత తన అన్న కేటీఆర్‌కు రాఖీ కడతారా? రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రాధాన్యం ఇస్తారా? అన్న ప్రశ్న ఆసక్తి రేపుతోంది.

ఇక ఆంధ్రప్రదేశ్‌లోనూ దాదాపు ఇదే తరహా చిత్రం. దివంగత వైఎస్సార్ వారసులుగా రాజకీయాల్లోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ షర్మిలారెడ్డి మధ్య దూరం అందరికీ తెలిసిందే. ఒకప్పుడు ఒకే కుటుంబంగా, ఒకే రాజకీయ శిబిరంగా కనిపించిన అన్నాచెల్లెళ్లు ఇప్పుడు వేర్వేరు రాజకీయ దారుల్లో సాగుతున్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీతో కొనసాగుతుండగా, జగన్ వైఎస్సార్‌సీపీకి నాయకత్వం వహిస్తున్నారు. తల్లి విజయమ్మతో షర్మిలకు సాన్నిహిత్యం ఉన్నప్పటికీ.. అన్నాచెల్లెళ్ల మధ్య రాజకీయ దూరం మాత్రం తగ్గలేదు.

కుటుంబ బంధాలు ఒకవైపు.. రాజకీయ సిద్ధాంతాలు, నిర్ణయాలు మరోవైపు అన్నట్టుగా పరిస్థితి మారింది.

అందుకే ఈ రాఖీ పౌర్ణమి రెండు కుటుంబాలకూ ఆసక్తికరమైన ప్రశ్నను ముందుకు తెస్తోంది. కవిత తన అన్న కేటీఆర్‌కు.. షర్మిల తన అన్న జగన్‌కు రాఖీ కడతారా? రాజకీయ వైరుధ్యాలను పక్కనపెట్టి పాత అనుబంధాన్ని గుర్తు చేసుకుంటారా? లేక రాజ కీయ ప్రయాణంలో ఎవరి దారి వారిదే అంటూ ఈ పండుగను కూడా తమ తమ ప్రపంచాల్లోనే జరుపుకుంటారా? సమాధానం ఏదైనా.. రాఖీ అనే చిన్న దారం ఈ ఇద్దరు అన్నాచెల్లెళ్ల మధ్య దూరాన్ని ఒక్క క్షణమైనా తగ్గిస్తుందా అన్నదే వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రశ్న.

# మొండి రిపేర్లకు మాస్టర్..!

**ప్రెస్టేజ్ సేవల్లో రాజేశ్వరరావు ప్రత్యేక ముద్ర**

ఏదైనా పని చేయాలంటే ముందు సంకల్పం ఉండాలి. పని చేయడం ఒక ఎత్తయితే.. ఆ పనికి బాధ్యతగా స్పందించడం మరో ఎత్తు. కొందరికి పని కేవలం ఉపాధి మాత్రమే. మరికొందరికి అదే బాధ్యత.. అదే గుర్తింపు. ఇంకొందరు పనినే దైవంగా భావిస్తారు. అలాంటి వారే తమ రంగంలో ప్రత్యేక ముద్ర వేస్తారు. ఈ కోవలోకి వచ్చే వ్యక్తే రాజేశ్వరరావు. పాలిటెక్నిక్ విద్యను అభ్యసించిన ఆయన సాంకేతిక పరిజ్ఞానాన్ని తన వృత్తికి బలంగా మార్చుకున్నారు. నేర్చుకున్న విద్యకు అనుభవాన్ని జోడించి నైపుణ్యంతో ముందుకు సాగుతున్నారు.

**ప్రెస్టేజ్ బ్రాండ్‌తో ప్రత్యేక గుర్తింపు**

ప్రముఖ గృహోపకరణాల బ్రాండ్ ప్రెస్టేజ్కు హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరిస్తూ రాజేశ్వరరావు తనదైన సత్తా చాటుతున్నారు. గృహోపకరణాల విక్రయాలకే పరిమితం కాకుండా వాటి




సర్వీసింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపడం ఆయన ప్రత్యేకత. చిన్న సమస్య నుంచి మొండి రిపేర్ వరకు పరిష్కారం చూపడంలో మంచి పట్టు సాధించారు. ఏ వస్తువు తీసుకొచ్చినా సమస్యను గుర్తించడం.. సాధ్యమైనంత త్వరగా రిపేర్ పూర్తి చేయడం శ్రీనగర్ బ్రాంచ్ ప్రత్యేకతగా నిలుస్తోంది.

**రిపేర్ తెచ్చుకోండి.. చిటికెలో పరిష్కారం**

ప్రెస్టేజ్ పేరుకు తగ్గ సేవలు అందించాలన్నదే రాజేశ్వరరావు లక్ష్యం. కస్టమర్ సమస్యను ఓపికగా తెలుసుకోవడం.. లోపాన్ని గుర్తించడం.. రిపేర్ పూర్తి చేసి తిరిగి అందించడం వరకు ప్రతి దశలో బాధ్యత కనిపిస్తుంది. ఎంత మొండి రిపేర్ అయినా పరిష్కారం వెతకడమే ఆయన పని తీరు. "రిపేర్ తెచ్చుకోండి.. పరిష్కారం తీసుకెళ్లండి" అన్నట్టుగా శ్రీనగర్ కాలనీ బ్రాంచ్ సేవలు సాగుతున్నాయి. పనిపై ప్రేమ, సాంకేతిక నైపుణ్యం, కస్టమర్‌కు వేగంగా స్పందించే తీరు రాజేశ్వరరావును ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. పని పట్ల అంకితభావం ఉంటే సాధారణ వృత్తిలోనూ అసాధారణ గుర్తింపు సాధించవచ్చని ఆయన ప్రస్థానం నిరూపిస్తోంది.

# పాకిస్థాన్ గూఢచర్యం



## ఎస్-400 కోసం పాక్ పన్నాగం
## ఆపరేషన్ సిందూర్‌లో కీలక ఆయుధం

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత రక్షణ వ్యవస్థలో రష్యా తయారీ ఎస్-400 వైమానిక రక్షణ వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని ఎయిర్ మార్షల్ జీతేంద్ర మిశ్రా వెల్లడించారు. ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఎస్-400 కారణంగానే పాకిస్థాన్ యుద్ధ విమానాలు భారత సరిహద్దుకు 200 కిలోమీటర్ల పరిధిలోకి కూడా చేరలేకపోయాయని చెప్పారు. భారత సైనిక చర్యల సమయంలో పౌరులకు ఎలాంటి నష్టం జరగకూడదనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. ఉగ్రవాదులు, వారి నిర్వాహకులనే లక్ష్యంగా చేసుకున్నామని మిశ్రా వివరించారు.

**గూఢచారుల కోసం పాక్ వేట**

ఎస్-400 ఎక్కడ మోహరించారో తెలుసుకునేందుకు పాకిస్థాన్ తీవ్రంగా ప్రయత్నించిందని మిశ్రా తెలిపారు. ఇందుకోసం గూఢచారులు, స్లీపర్ సెల్స్‌ను సైతం రంగంలోకి దించినట్లు చెప్పారు. ఎస్-400 స్థానాలను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న ప్రతి మార్గాన్ని పాకిస్థాన్ ఉపయోగించిందని పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి ఉపగ్రహ సమాచారం కూడా పాకిస్థాన్‌కు అందిందని మిశ్రా చెప్పారు. ఆ దేశాల పేర్లను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇదే సమయంలో భారత సైన్యంలోని ఉన్నతాధికారి లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్. సింగ్ గతంలో చైనా పాకిస్థాన్‌కు భారత కీలక సైనిక వ్యవస్థలపై రియల్‌టైమ్ సమాచారం అందించిందని వెల్లడించిన విషయాన్ని కూడా ఈ వ్యాఖ్యలు గుర్తు చేస్తున్నాయి.

### 314 కిలోమీటర్ల దూరంలో సంచలన దాడి

భారత ఎస్-400 వ్యవస్థను పాకిస్థాన్ ప్రధాన ముప్పుగా భావించిందని మిశ్రా తెలిపారు. పాకిస్థాన్ విమానాలు గాల్లోకి వచ్చిన ప్రతిసారీ వాటిని ఎస్-400 లక్ష్యంగా చేసుకుందని చెప్పారు. ఒక సందర్భంలో ఎస్-400 ఆపరేటర్ కాల్పులకు అనుమతి కోరగా తాను ఆదేశం ఇచ్చినట్లు వివరించారు. 314 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాన్ని ఎస్-400 కూల్చివేసిందని మిశ్రా పేర్కొన్నారు. ఇది ప్రపంచ చరిత్రలోనే అత్యంత దూరం నుంచి జరిగిన భూ-వైమానిక క్షిపణి దాడిగా ఆయన అభివర్ణించారు. భారత్ 2018లో రష్యాతో 5 ఎస్-400 వ్యవస్థల కోసం 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. అత్యంత ఆధునిక, మొబైల్ లాంగ్‌రేంజ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థగా పేరున్న ఎస్-400ను భారత్ 'సుదర్శన చక్రం'గా కూడా పిలుస్తోంది.



## నేపాల్ వరదల్లో ఏపీ యాత్రికులపై ఆరా

**లోకేశ్ సమీక్ష.. ముగ్గురి ఆచూకీ కోసం గాలింపు**

అమరావతి, ఆగస్టు 27: నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమంపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నేపాల్‌లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల్లో నలుగురు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో ముగ్గురి ఆచూకీ ఇంకా లభించలేదని వెల్లడించారు. కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ సభ్యులు శశికుమార్, రాజ్యలక్ష్మి కనిపించకుండా పోయినట్లు అధికారులు తెలిపారు. మిస్సైన ముగ్గురి ఆచూకీ కోసం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని లోకేశ్ ఆదేశించారు. భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్‌తో సమన్వయం కొనసాగించాలని తెలిపారు. ఆర్టీజీఎస్ అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తుండగా, ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ నిరంతరం సమీక్షిస్తున్నారు.

## కార్పొరేట్‌ల దూకుడు

**స్థానిక వ్యాపారులను కాపాడాలి: రాచమల్లు**



ప్రొద్దుటూరు, ఆగస్టు 27: పట్టణ అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థకు స్థానిక వ్యాపారులే వెన్నెముక అని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం దొరసానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల విస్తరణతో చిన్న, మధ్య తరహా వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పండుగల సమయంలో భారీ ఆఫర్లతో బయటి సంస్థలు రావడం స్థానిక వర్తకులపై ప్రభావం చూపుతోందన్నారు. స్థానిక వ్యాపారులు అరువు, గ్యారంటీ, రీప్లేస్‌మెంట్ వంటి సౌకర్యాలతో ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. బంగారు వ్యాపారం సహా అనేక రంగాలపై వేలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలపై అధికంగా ఆధారపడితే స్థానిక ఉపాధికి ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. స్థానిక వ్యాపారులను ప్రోత్సహిస్తే పట్టణంలోనే డబ్బు చలామణి అవుతుందని, ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని అన్నారు. ప్రజలు స్థానిక వ్యాపారులను ఆదరించాలని రాచమల్లు పిలుపునిచ్చారు.



## విలువలకు ప్రతీక రక్షాబంధనం

**ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి పవిత్ర రాఖీ**

ప్రొద్దుటూరు: విశ్వ సోదర సౌభ్రాతృత్వం, ఆత్మరక్షణ, మానవీయ విలువలకు రక్షాబంధనం ప్రతీకగా నిలుస్తుందని ఓం శాంతి భవన్ నిర్వాహకురాలు బ్రహ్మకుమారి శాంత సౌజన్య అన్నారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి సంప్రదాయ పద్ధతిలో రాఖీ కట్టారు. తొలుత ఎమ్మెల్యే నుదుట తిలకం దిద్దిన ఆమె, అనంతరం పవిత్ర రాఖీ కంకణాన్ని ధరింపజేసి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా శాంత సౌజన్య మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రక్షాబంధనం విశిష్టమైన పండుగగా నిలుస్తుందన్నారు. కుటుంబ బంధాలు, సోదర సోదరీ అనుబంధాలను బలోపేతం చేస్తూ సమాజంలో ఐక్యత, ప్రేమ, పరస్పర రక్షణ భావనను పెంపొందించడమే ఈ పండుగ ఉద్దేశమని తెలిపారు. దూరంగా ఉన్న వారిని దగ్గర చేస్తూ, మానవ సంబంధాలను మరింత పటిష్టం చేసే శక్తి రాఖీకి ఉందన్నారు.

## ప్రొద్దుటూరు ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు

ప్రొద్దుటూరు: పట్టణంలోని అక్కాచెల్లెళ్లందరికీ రాఖీ పౌర్ణమి, రక్షా బంధన్, శ్రావణ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి సందర్భంగా ప్రొద్దుటూరు పురపాలక సంఘం కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే ఈ పవిత్రమైన పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, ఐక్యత, సంతోషాలను నింపాలని ఆయన ఆకాంక్షించారు. రక్షా బంధన్ సందర్భంగా సోదర సోదరీమణుల మధ్య ఆత్మీయత, అనుబంధం మరింత బలపడాలని కోరుకున్నారు. ప్రొద్దుటూరు పట్టణ ప్రజలందరికీ, ముఖ్యంగా అక్కాచెల్లెళ్లకు తాను సోదరుడిగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రొద్దుటూరు పురపాలక సంఘం ద్వారా మెరుగైన పౌర సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని శ్రీనివాస విశ్వనాథ్ పేర్కొన్నారు. పట్టణ ప్రజలందరికీ, వారి కుటుంబ సభ్యులకు ఆయన హృదయపూర్వక రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.




## ఎమ్మెల్యే ఫిర్యాదుతో కదలిక

**అగ్రిగోల్డ్ అటాచ్డ్ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌పై సీఐడీ కేసు**
**ఫోర్జరీ పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ ఆరోపణలు**

ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లి గ్రామంలో అగ్రిగోల్డ్‌కు చెందిన అటాచ్డ్ ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై సీఐడీ కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఫిర్యాదు నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. సర్వే నంబర్ 89/4లోని 1.70 ఎకరాల భూమిని రూ.57.60 లక్షలకు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2015లోనే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఆస్తి అటాచ్మెంట్‌లో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు సీఐడీ దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. అగ్రిగోల్డ్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో ఉన్న భూమి రిజిస్ట్రేషన్‌కు కంపెనీ బోర్డు తీర్మానం, లెటర్‌హెడ్‌పై ఎండీ సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించినట్లు కేసులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. పలువురు వ్యక్తులతో పాటు అప్పటి సబ్‌రిజిస్ట్రార్ విద్యాసాగర్‌రెడ్డిని నిందితుడిగా చేర్చినట్లు సమాచారం. ఫోర్జరీ, మోసం, అటాచ్డ్ ఆస్తి రిజిస్ట్రేషన్ అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మరెవరైనా అధికారులు, మధ్యవర్తుల పాత్ర ఉందా అనే కోణంలోనూ సీఐడీ విచారణ సాగిస్తోంది.

## ప్రారంభానికి ముందే భారీ రంధ్రం

**నాణ్యతా లోపంతో కుంగిన బ్రిడ్జి సీసీ రోడ్డు**



ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో: రేవల్లి-నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై పంట పొలాలకు వెళ్లే సాగునీటి కాలువపై ఇటీవల నిర్మించిన బ్రిడ్జి సీసీ రోడ్డు ప్రారంభానికి ముందే కుంగిపోయింది. రోడ్డులో పెద్ద రంధ్రం ఏర్పడటంతో నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మాజీ జడ్పీటీసీ భీమయ్య, మాజీ సర్పంచ్ శివరాం రెడ్డి ఆరోపించారు. ఈ మార్గంలో నిత్యం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, నాగర్‌కర్నూల్ వెళ్లే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## గంజాయి అక్రమ విక్రయాలకు చెక్

ప్రొద్దుటూరు: పట్టణంలో గంజాయి అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 50 పొట్లాల్లో ఉన్న 385 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.8 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం అందిన సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానా స్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి పొట్లాలు బయటపడ్డాయి. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ టి.వి. కొండారెడ్డి, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.




# మఠంలో ముఠాలు

## నాడు కాలజ్ఞానం...
## నేడు కాలసర్పాలు

**బ్రహ్మంగారి మఠం పేరు వినగానే భక్తులకు గుర్తుకొచ్చేది ఆధ్యాత్మికత, కాలజ్ఞానం, బ్రహ్మంగారి జీవసమాధి. కానీ ఇప్పుడు అదే పవిత్ర పీఠం చుట్టూ వినిపిస్తున్న వివాదాలు భక్తుల్లో ఆందోళన రేపుతున్నాయి. పీఠాధిపతి పదవిపై విభేదాలు, కుటుంబ తగాదాలు, పరస్పర ఆరోపణలు, పోలీస్ కేసులు, కోర్టు వ్యవహారాలు, పరిపాలనపై ప్రశ్నలు, ఉద్యోగ నియామకాల వివాదాలు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. మాజీ మేనేజర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ కొనసాగుతున్న అంశం కూడా చర్చకు దారితీస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని విచారణ పూర్తికాకముందే దోషులుగా తేల్చడం సరికాదు. అదే సమయంలో ఆరోపణల వెనుక వాస్తవం ఏమిటో తెలుసుకోవడం కూడా భక్తుల హక్కే. మఠం అంటే కేవలం ఒక భవనం కాదు. అది తరతరాల విశ్వాసానికి ప్రతీక. అందుకే అక్కడి పరిపాలనపై వచ్చే ప్రతి ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఉండాలి. పదవుల కోసం పోరాటమా? పీఠం పవిత్రత కోసం పోరాటమా? అన్న ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది. వ్యక్తులు మారవచ్చు. పదవులు మారవచ్చు. కానీ బ్రహ్మంగారి మఠం గౌరవం మాత్రం శాశ్వతంగా నిలవాలి. ఈ నేపథ్యంలో వివాదాల వెనుక అసలు వాస్తవాలను ఆధారాలతో పరిశీలిస్తూ, ఆరోపణలను ఆరోపణలుగానే చూపిస్తూ, అధికారిక వివరాలను ప్రజల ముందుంచే ప్రయత్నమే ఈ వరుస కథనాల లక్ష్యం. మఠంలో ముఠాల గుట్టు రట్టవుతుందా? అసలు కథ ఏమిటి? ఇదే ఇప్పుడు భక్తుల ముందున్న ప్రశ్న.**

### • పవిత్ర పీఠానికి పెరుగుతున్న ముప్పు

బ్రహ్మంగారి మఠం చుట్టూ వరుసగా వినిపిస్తున్న వివాదాలు ఇప్పుడు భక్తుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. పీఠాధిపతి పదవిపై విభేదాలు, కుటుంబ తగాదాలు, పరస్పర ఆరోపణలు, పోలీస్ కేసులు, కోర్టు వ్యవహారాలు, పరిపాలనా లోపాలపై ప్రశ్నలు, ఉద్యోగ నియామకాల వివాదాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో అసలు పరిస్థితి ఎటువైపు వెళ్తోందన్న ప్రశ్న తలెత్తుతోంది. ఆధ్యాత్మిక ప్రశాంతతకు నిలయంగా ఉండాల్సిన మఠంలో అధికారం, ఆధిపత్యం, వ్యక్తిగత విభేదాలు ముందుకు వస్తే దాని ప్రభావం నేరుగా భక్తుల విశ్వాసంపై పడుతుంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని విచారణ పూర్తికాకముందే దోషులుగా నిర్ణయించడం ఎంత తప్పో, ఆరోపణలు వచ్చాయని వాటిని పట్టించుకోకపోవడం కూడా అంతే తప్పు. నిజం తేలాలి.. బాధ్యత నిర్ణయించాలి.. తప్పు ఉంటే చర్యలు తీసుకోవాలి.. నిర్దోషుల గౌరవం కాపాడాలి. మఠం పరిపాలనలో పారదర్శకత లేకపోతే అనుమానాలు పెరుగుతాయి. అనుమానాలు పెరిగితే వివాదాలు మరింత ముదురుతాయి. వివాదాలు ముదిరితే చివరకు నష్టపోయేది వ్యక్తులు కాదు.. బ్రహ్మంగారి మఠం ప్రతిష్ఠ, భక్తుల విశ్వాసం. అందుకే ఇప్పుడు అసలు ప్రశ్న ఒక్కటే ఈ అరాచకాలు ఎటువైపు? పీఠం పవిత్రత వైపా.. వ్యక్తిగత ఆధిపత్యం వైపా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మఠానికి సంబంధించిన ప్రతి ఒక్కరిపైనా ఉంది.





### • విశ్వాసానికి ప్రతిరూపం.. బ్రహ్మంగారి మఠం

దేవుడు ఉన్నాడా? లేడా? అనే ప్రశ్నకు శాస్త్రీయంగా తేల్చిన సమాధానం లేకపోయినా, దేవుడిని నమ్మి జీవించడం కోట్లాది మంది ప్రజల అచంచల విశ్వాసం. ఆ విశ్వాసానికి ఆధ్యాత్మిక రూపంగా నిలిచిన మహాజ్ఞాని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పేరు తెలుగు నేలపై ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఆయన జీవసమాధి ఉన్న బ్రహ్మంగారి మఠం భక్తులకు సాధారణ పుణ్యక్షేత్రం కాదు. అది ఒక విశ్వాస కేంద్రం.. ఆధ్యాత్మిక వారసత్వం.. తరతరాల భావోద్వేగం. శతాబ్దాల క్రితం బ్రహ్మంగారు కాలజ్ఞానంలో పలికినట్లు భక్తులు విశ్వసించే ఎన్నో వాక్యాలను నేటి పరిణామాలతో పోల్చి చూస్తుంటారు. కాలజ్ఞానం నిజంగా భవిష్యత్తును ముందుగానే తెలిపిందా? అందులో ప్రచారంలో ఉన్న ప్రతి వాక్యం అసలు గ్రంథాల్లోనే ఉందా? అనే విషయాలపై పండితులు, పరిశోధకులు, భక్తుల్లో భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. అయితే ఆ చర్చలన్నింటినీ దాటి కాలజ్ఞానం పట్ల ప్రజల్లో ఉన్న భక్తి మాత్రం ఇప్పటికీ బలంగానే ఉంది. అందుకే బ్రహ్మంగారి మఠంలో చోటుచేసుకునే ప్రతి చిన్న పరిణామం కూడా సాధారణ పరిపాలనా అంశంగా మిగలదు. అది లక్షలాది మంది భక్తుల మనోభావాలకు తాకే అంశంగా మారుతుంది. మఠం పేరు వినగానే భక్తుల కళ్ల ముందు కనిపించేది రాజకీయాలు కాదు.. పదవుల పోటీ కాదు.. ఆస్తుల వివాదం కాదు.. బ్రహ్మంగారి సమాధి.. కాలజ్ఞానం.. ఆధ్యాత్మిక ప్రశాంతత. అలాంటి పవిత్ర స్థలంలో వివాదాలు, ఆరోపణలు, పరస్పర విమర్శలు వినిపిస్తే సహజంగానే భక్తుల మనసులో కలవరం మొదలవుతుంది. మఠం గౌరవం వ్యక్తుల కంటే పెద్దది. పీఠం ప్రతిష్ఠ పదవుల కంటే గొప్పది. ఈ ప్రాథమిక సత్యాన్ని అందరూ గుర్తించాల్సిన అవసరం ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

### • పీఠం చుట్టూ ప్రశ్నల మబ్బులు

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మంగారి మఠానికి వస్తారు. సమాధి సన్నిధిలో కొద్దిసేపు కూర్చుని ఆధ్యాత్మిక ప్రశాంతత పొందాలని కోరుకుంటారు. స్వామివారి బోధనలను స్మరించుకుంటారు. కాలజ్ఞాన వాక్యాలను తలచుకుంటారు. తమ కుటుంబ సమస్యలు తొలగాలని, జీవితం సుఖంగా సాగాలని ప్రార్థిస్తారు. అయితే అదే భక్తులు మఠానికి సంబంధించిన వివాదాల గురించి విన్నప్పుడు తీవ్రంగా కలత చెందుతున్నారు. "ఇది కలికాలం కాకపోతే ఇంకేమిటి?" అనే ప్రశ్న పలువురి నుంచి వినిపిస్తోంది. పీఠాధిపతి పదవికి సంబంధించిన వివాదాలు, కుటుంబ విభేదాలు, పరస్పర ఆరోపణలు, పోలీస్ కేసులు, కోర్టు వ్యవహారాలు, పరిపాలనా అంశాలపై అనుమానాలు, ఉద్యోగ నియామకాలపై వివాదాలు వంటి అంశాలు ఒక్కొక్కటిగా చర్చలోకి వస్తున్నాయి. మాజీ మేనేజర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి విచారణ కొనసాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పదవీ విరమణ జరిగినా విచారణ కొనసాగడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ ఒక విషయం స్పష్టంగా చెప్పాల్సిందే. ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తి దోషి అని విచారణ పూర్తయ్యే వరకు చెప్పడం న్యాయం కాదు. ప్రతి వ్యక్తికి తన వాదనను వినిపించే హక్కు ఉంది. అధికారిక విచారణ పూర్తై ఆధారాలతో వాస్తవాలు తేలిన తరువాతే తుది నిర్ణయం రావాలి. అయితే ఆరోపణలు బయటకు రావడం వల్ల మఠం ప్రతిష్ఠపై సందేహాలు కలగడం మాత్రం సహజం. అందుకే ప్రతి ఆరోపణను ప్రచారంగా కాకుండా ఆధారాలతో పరిశీలించాల్సిన అవసరం ఉంది. మఠానికి సంబంధించిన పరిపాలనలో ఏ తప్పు జరిగినా అది వ్యక్తిగత వ్యవహారంగా చూడలేం. భక్తుల కానుకలు, విశ్వాసం, ఆధ్యాత్మిక వారసత్వం అక్కడ ముడిపడి ఉన్నాయి. అందుకే నిజం ఏది? ఆరోపణ ఏది? అధికారికంగా తేలింది ఏది? అనే మూడు అంశాలను వేరు చేసి ప్రజల ముందుంచాలి.

### • పదవి కోసం పోరా.. పీఠం కోసం పోరా?

పీఠాధిపతి స్థానం సాధారణ ఉద్యోగం కాదు. అది ఒక ఆధ్యాత్మిక బాధ్యత. ఒక సంప్రదాయానికి ప్రతినిధిత్వం చేసే స్థానం. తరతరాలుగా కొనసాగుతున్న విశ్వాసానికి సంరక్షకుడిగా నిలిచే బాధ్యత. అలాంటి స్థానానికి సంబంధించిన విభేదాలు బహిరంగంగా బయటకు వస్తే భక్తులు ప్రశ్నించడం సహజం. పీఠం కోసం పోరాటం జరగాలా? పీఠం పవిత్రత కోసం పోరాటం జరగాలా? ఇదే అసలు ప్రశ్న. ఒక వ్యక్తి పీఠంపై కూర్చోవడం కంటే ఆ పీఠం విలువలను కాపాడటం ముఖ్యమని భక్తులు భావిస్తున్నారు. కుటుంబ సంబంధాలు ఉండవచ్చు. వారసత్వ హక్కులపై అభిప్రాయాలు ఉండవచ్చు. పరిపాలనా హక్కులపై వివాదాలు రావచ్చు. అయితే ఇవన్నీ చివరకు చట్టబద్ధమైన మార్గంలో పరిష్కరించాల్సిన అంశాలు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, బహిరంగ వేదికలపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావు. పైగా వివాదం మరింత ముదురుతుంది. బ్రహ్మంగారి బోధనలతో అనుసంధానించి భక్తులు తరచుగా గుర్తుచేసుకునే అంశాలు ధర్మం, నీతి, వైరాగ్యం, మానవత్వం. కాలజ్ఞానం పేరుతో ప్రచారంలో ఉన్న అనేక భావాల్లో కలియుగంలో స్వార్థం పెరగడం, మానవ విలువలు క్షీణించడం గురించి భక్తులు ప్రస్తావిస్తారు. ఆ భావాలను ఇతరులపై ప్రయోగించడం సులభం. కానీ ముందుగా మనల్ని మనం ప్రశ్నించుకోవడం కష్టం. "నేను చేస్తున్న పని పీఠం గౌరవాన్ని పెంచుతోందా? నా మాట భక్తుల విశ్వాసాన్ని బలపరుస్తుందా?" అనే ప్రశ్న ప్రతి బాధ్యతలో ఉన్న వ్యక్తి వేసుకోవాలి. పీఠం ఒకరి సొంత ఆస్తి కాదు. అది ఒక ఆధ్యాత్మిక బాధ్యత. వ్యక్తులు వస్తారు.. వ్యక్తులు వెళ్తారు. పదవులు మారుతాయి. కాలం మారుతుంది. కానీ పీఠం పవిత్రత మాత్రం తరతరాలకు నిలవాలి.

### • ఉద్యోగం కాదు.. పవిత్ర సేవ

మఠంలో పనిచేసే ప్రతి ఒక్కరి బాధ్యత సాధారణ కార్యాలయ ఉద్యోగి బాధ్యత కంటే ఎక్కువ. ఎందుకంటే అక్కడికి వచ్చే భక్తుడు కేవలం ఒక సేవ పొందడానికి రావడం లేదు. తన విశ్వాసాన్ని మోసుకుని వస్తున్నాడు. భక్తుడు ఇచ్చే ప్రతి రూపాయి వెనుక ఒక నమ్మకం ఉంటుంది. ప్రతి కానుక వెనుక ఒక ప్రార్థన ఉంటుంది. ప్రతి దర్శనం వెనుక ఒక ఆశ ఉంటుంది. అందుకే మఠంలోని ఆర్థిక వ్యవహారాలు స్పష్టంగా ఉండాలి. ఉద్యోగ నియామకాలు నిబంధనల ప్రకారం జరగాలి. పరిపాలనా నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలి. ఎవరి మీదైనా ఆరోపణ వస్తే నిష్పాక్షిక విచారణ జరగాలి. తప్పు నిరూపితమైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. తప్పు నిరూపితం కాకపోతే వ్యక్తి గౌరవాన్ని కాపాడాలి. ఇదే న్యాయం. ఇదే బాధ్యత. మఠం అంటే అధికారం కాదు.. ఆరాధన. మఠం అంటే సంపాదన కాదు.. సేవ. మఠం అంటే ఆధిపత్యం కాదు.. ఆధ్యాత్మిక బాధ్యత. ఈ మూడు మాటలు అక్కడి ప్రతి నిర్ణయానికి ప్రమాణంగా మారాలి. ఉద్యోగ నియామకాల్లో ఎవరి సిఫార్సు పనిచేసింది? ఎవరి అర్హతను పరిగణించారు? ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత ఎంత ఉంది? బాధ్యతలు ఎలా అప్పగిస్తున్నారు? ఆరోపణలపై ఎలాంటి విచారణ జరిగింది? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లభిస్తే అనుమానాలకు తావు తగ్గుతుంది. సమాధానాలు లేకపోతే అనుమానాలు పెరుగుతాయి. మఠం ప్రతిష్ఠను కాపాడేందుకు పారదర్శకతే మొదటి రక్షణ గోడ. ఎవరైనా వ్యక్తి తప్పు చేస్తే ఆ తప్పును మొత్తం మఠానికి అంటగట్టడం కూడా సరికాదు. అలాగే మఠం పేరు చెప్పి ఎలాంటి చర్యనైనా ప్రశ్నించకుండా వదిలేయడం కూడా సరికాదు. వ్యక్తిని కాకుండా వ్యవస్థను పరిశీలించాలి. ఆరోపణను కాకుండా ఆధారాన్ని పరిశీలించాలి. ప్రచారాన్ని కాకుండా అధికారిక రికార్డును పరిశీలించాలి.

### • సోషల్ మీడియా.. విషప్రచారానికి వేదిక కాకూడదు

మఠానికి సంబంధించిన వివాదాలు ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపైకి రావడం మరో ఆందోళనకర పరిణామం. ఆరోపణలు, ప్రత్యారోపణలు, వ్యక్తిగత విమర్శలు, అసభ్యకర వ్యాఖ్యలు, ధృవీకరణ లేని పోస్టులు వేగంగా వ్యాపిస్తే వాస్తవం ఏదో తెలుసుకోవడం భక్తులకు కష్టమవుతుంది. ఒక వీడియో వైరల్ కావచ్చు. ఒక పోస్టు వేల మందికి చేరవచ్చు. ఒక ఆరోపణ గంటల్లోనే పెద్ద చర్చగా మారవచ్చు. కానీ వైరల్ కావడం వల్ల అది నిజం అయిపోదు. సోషల్ మీడియాలో కనిపించిన ప్రతి ఆరోపణ వాస్తవం కాదు. అలాగే ప్రతి ఆరోపణను పూర్తిగా కొట్టిపారేయడం కూడా సరైన పద్ధతి కాదు. ఆధారాలు పరిశీలించాలి. అధికారిక పత్రాలు చూడాలి. సంబంధిత వ్యక్తుల వాదనలు వినాలి. విచారణ స్థితి తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడం ద్వారా ఎవరికీ శాశ్వత విజయం దక్కదు. ఒకరు తాత్కాలికంగా గెలిచినా, మఠం పేరు దెబ్బతింటే అది నిజమైన విజయం కాదు. ఓడిపోయేది వ్యక్తి కాదు.. భక్తుల విశ్వాసం. ఈ పరిస్థితుల్లో మీడియా బాధ్యత కూడా అత్యంత కీలకం. ఆరోపణను ఆరోపణగానే చెప్పాలి. నిర్ధారణైన విషయాన్ని వాస్తవంగా చెప్పాలి. కోర్టు విచారణలో ఉన్న అంశాన్ని తీర్పుగా చూపకూడదు. అధికారికంగా నిర్ధారించని సమాచారాన్ని సంచలనంగా మార్చకూడదు. ఇదే బాధ్యతాయుతమైన జర్నలిజం. మఠం గౌరవాన్ని కాపాడాలంటే ప్రశ్నలు ఆగాల్సిన అవసరం లేదు. ప్రశ్నలు మరింత స్పష్టంగా ఉండాలి. కానీ ప్రశ్న వెనుక ఆధారం ఉండాలి. పరిశీలన వెనుక నిజాన్వేషణ ఉండాలి. వ్యక్తులపై దాడి కాదు.. వ్యవస్థపై పరిశీలన. వ్యక్తిగత ప్రయోజనం కాదు.. ప్రజా ప్రయోజనం. ఇదే సరైన మార్గం.

### • కాలజ్ఞానం చెప్పేది భవిష్యత్తా.. మన బాధ్యతా?

కాలజ్ఞానాన్ని కేవలం భవిష్యత్ చెప్పే గ్రంథంగా కాకుండా మనిషి ప్రవర్తనకు అద్దంగా చూడాలి. కాలం, పరిస్థితులు, ఆలోచనలు, సాంకేతికత మారినా ధర్మం విలువ మారకూడదు. "కలికాలం చెడిపోయింది" అనడం సులభం.. "కలికాలం చెడిపోకుండా నేను ఏం చేస్తున్నాను?" అని ప్రశ్నించుకోవడమే అసలు పరీక్ష. బ్రహ్మంగారి మఠం చుట్టూ ఉన్న వివాదాలు కూడా ఇదే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. కుటుంబ సమస్యలు కుటుంబ పరిధిలో, పరిపాలనా వివాదాలు చట్టబద్ధంగా, ఆర్థిక ఆరోపణలు పారదర్శక విచారణతో పరిష్కరించాలి. పదవుల విషయంలో సంప్రదాయం, నిబంధనలు, చట్టాన్ని పాటించాలి. ఎవరూ పీఠం కంటే పెద్దవారు కాదు.. మఠం కంటే పెద్దవారు కాదు.. భక్తుల విశ్వాసం కంటే పెద్దవారు కాదు. నాదేశం వరుస కథనాల లక్ష్యం ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం కాదు.. ఎవరినీ కాపాడటం కూడా కాదు. ఆధారాలను పరిశీలించడం.. అధికారిక వివరాలను ప్రజల ముందుంచడం.. తప్పు ఉంటే ప్రశ్నించడం.. అన్యాయం ఉంటే నిలదీయడం.. నిర్దోషి గౌరవాన్ని కాపాడటం మా బాధ్యత. ఒక్కో రోజు.. ఒక్కో అంశం.. ఒక్కో ప్రశ్నగా మఠానికి సంబంధించిన వివాదాల వెనుక వాస్తవాలను పరిశీలిస్తాం. ఆరోపణల్లో నిజమెంత? పరిపాలనలో లోపాలున్నాయా? నియామకాల్లో నిబంధనలు పాటించారా? ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా ఉన్నాయా? పీఠం ప్రతిష్ఠకు ముప్పు ఉందా? అనే అంశాలను ఆధారాలతో ప్రజల ముందుంచుతాం. ఇది ఎవరి మీద యుద్ధం కాదు.. బ్రహ్మంగారి మఠం గౌరవం, భక్తుల విశ్వాసం, పీఠం పవిత్రత కోసం చేసే ప్రయత్నం. మనుషులు, పదవులు, అధికారాలు మారవచ్చు.. కానీ మఠం పవిత్రత తరతరాలకు నిలవాలి. కాలజ్ఞానం దిక్సూచి అయితే.. బ్రహ్మంగారి బోధన మార్గదర్శి కావాలి. భక్తి మన బలం.. ధర్మమే మన గమ్యం. గొడవలు ఆగాలి.. గౌరవం నిలవాలి.. ఆరోపణలు పరిశీలించాలి.. వాస్తవాలు వెలుగులోకి రావాలి.. అధికారం తగ్గాలి.. సేవ పెరగాలి. అప్పుడే బ్రహ్మంగారి పీఠం నిజమైన ఆధ్యాత్మిక పీఠంగా వెలుగుతుంది.



## ఇంకా చాలా ఉంది!

### పీఠం చుట్టూ పెరుగుతున్న వివాదాలు

బ్రహ్మంగారి మఠం చుట్టూ పీఠాధిపతి పదవి, కుటుంబ విభేదాలు, పరస్పర ఆరోపణలు, పోలీస్ కేసులు, కోర్టు వ్యవహారాలు, పరిపాలనా అంశాలు వరుసగా చర్చకు వస్తున్నాయి. పవిత్ర పీఠంలో వ్యక్తిగత విభేదాలకు చోటు ఉందా? అనే ప్రశ్న భక్తుల్లో తలెత్తుతోంది. వివాదాల ప్రభావం చివరకు మఠం ప్రతిష్ఠపై పడకుండా బాధ్యతాయుతంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది.

### ఆరోపణలు.. విచారణ.. వాస్తవం

మాజీ మేనేజర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ కొనసాగుతున్న అంశం కూడా చర్చనీయాంశంగా మారింది. అయితే విచారణ పూర్తికాకముందే ఎవరినీ దోషిగా తేల్చడం సరికాదు. అదే సమయంలో ఆరోపణల వెనుక నిజానిజాలను అధికారికంగా వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉంది. ఆధారాలు, రికార్డులు, విచారణ ఫలితాల ఆధారంగా మాత్రమే తుది నిర్ణయం రావాలి.

### పదవా.. పీఠం పవిత్రతా?

పీఠాధిపతి స్థానం సాధారణ పదవి కాదు. అది ఆధ్యాత్మిక బాధ్యత, సంప్రదాయానికి ప్రతినిధిత్వం, భక్తుల విశ్వాసానికి సంరక్షణ. అందుకే పీఠం కోసం పోరాటం కాకుండా పీఠం పవిత్రత కోసం ప్రయత్నం జరగాలి. వ్యక్తులు, కుటుంబాలు, వర్గాలు ఎవరు గెలిచారన్నది ముఖ్యం కాదు. చివరకు బ్రహ్మంగారి మఠం గౌరవం నిలవడమే అసలు విజయం.

### సోషల్ మీడియాతో గందరగోళం

మఠానికి సంబంధించిన ఆరోపణలు, ప్రత్యారోపణలు సోషల్ మీడియాలో వేగంగా ప్రచారం కావడం మరో సమస్యగా మారింది. ధృవీకరణ లేని సమాచారం భక్తుల్లో అనుమానాలు పెంచుతోంది. వైరల్ అయిన ప్రతి సమాచారం వాస్తవం కాదు. అందుకే ఆరోపణలను ఆధారాలతో పరిశీలించి, అధికారిక వివరాలను మాత్రమే ప్రజల ముందుంచాలి. వ్యక్తిగత దూషణలు, బురదజల్లుడు మఠం ప్రతిష్ఠకు మరింత నష్టం చేస్తాయి.

### గెలవాల్సింది భక్తుల విశ్వాసమే

బ్రహ్మంగారి మఠం విషయంలో వ్యక్తుల ప్రయోజనం కంటే భక్తుల విశ్వాసం, పీఠం పవిత్రత ముఖ్యమైనవి. కుటుంబ సమస్యలు కుటుంబ పరిధిలో, పరిపాలనా వివాదాలు చట్టబద్ధంగా, ఆర్థిక ఆరోపణలు పారదర్శక విచారణ ద్వారా పరిష్కరించాలి. మనుషులు మారవచ్చు.. పదవులు మారవచ్చు.. కానీ మఠం పవిత్రత శాశ్వతంగా నిలవాలి. ఇదే ఈ మొత్తం వివాదాల మధ్య ప్రధాన సందేశం.

ఓరుగల్లు గడ్డ మీద కొండా దంపతుల హవాకు బ్రేక్ పడిందా? ఇన్నాళ్లు "మా మాటే.. మా లెక్కే" అన్నట్టుగా సాగిన రాజకీయానికి ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి చెక్ పెట్టారా? వరంగల్ ఈస్ట్‌లో కొండా వర్గానికి వ్యతిరేకంగా ఒక్కొక్క నేత బయటకు వస్తున్నారనే చర్చ కాంగ్రెస్‌లో కాక రేపుతోంది. నిన్న మొన్నటి వరకు తమ వెంట నడిచిన రాజకీయ సమీకరణాలే ఇప్పుడు ఎదురుగా నిలబడుతున్నాయన్న సంకేతాలు కొండా దంపతులకు షాక్ ఇస్తున్నాయి. ఆయుబ్ నుంచి బసవరాజు సారయ్య వరకు.. నాగరాజు నుంచి కడియం శ్రీహరి వరకు.. ఎవరి లెక్కలు వారివే అన్న పరిస్థితి కనిపిస్తోంది. పైగా సీనియర్ల స్థానంలో కొత్త తరం నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలన్న సీఎం ఆలోచనలకు ఇది బలం చేకూరుస్తోందన్న టాక్ వినిపిస్తోంది. డిలిమిటేషన్ లెక్కలు మారితే సమీకరణాలు మరింత తలకిందులు కావచ్చు. అందుకే ఇప్పుడు కొండా దంపతుల ముందున్నది ఒక్కటే ప్రశ్న.. "ఓరుగల్లు మీద మా పట్టు ఇంకా ఉందా? లేక సీఎం గేమ్‌లో మా చాప్టర్ క్లోజ్ అయిందా?" రాజకీయ వర్గాల్లో ఇదే హాట్ టాపిక్.

### ఓరుగల్లులో కొండా దంపతులకు షాక్



# కొండాకు దెబ్బ

## రేవంత్ మాస్టర్ స్ట్రోక్

**• కొండా చాప్టర్ క్లోజ్.. ఓరుగల్లులో కొత్త గేమ్**

వరంగల్ ఈస్ట్ రాజకీయాల్లో ప్రస్తుతం వినిపిస్తున్న చర్చ ఒక్కటే. కొండా వర్గానికి రాజకీయంగా గట్టి ఎదురుదెబ్బ తగలబోతోందా? సీఎం రేవంత్ రెడ్డి వ్యూహంలో కొండా కుటుంబం చిక్కుకుపోయిందా? అనే ప్రశ్నలు కాంగ్రెస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా అంతర్గత రాజకీయ పరిణామాలపై జరిగిన చర్చలో పలువురు నాయకుల పేర్లు ప్రస్తావనకు రావడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యత తెచ్చింది. ముఖ్యంగా వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో కొండా సురేఖ వర్గానికి అనుకూలంగా కనిపించే రాజకీయ వాతావరణం క్రమంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్‌లోనే పలువురు నేతలు కొండా కుటుంబానికి దూరంగా ఉన్నారనే వాదన కూడా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నేరుగా ఢీకొట్టకుండా, రాజకీయంగా ప్రత్యామ్నాయాలను సిద్ధం చేస్తూ ముందుకు వెళ్తున్నారనే విశ్లేషణ మొదలైంది. ఇది కేవలం వ్యక్తుల మధ్య విభేదం కాదు.. వరంగల్ ఈస్ట్‌లో భవిష్యత్ ఆధిపత్యం కోసం జరుగుతున్న అంతర్గత రాజకీయ పోరాటంగా కనిపిస్తోంది. ఎన్నికలు సమీపంలో లేని సమయంలోనే ఈ పరిణామాలు బయటకు రావడం కూడా చర్చకు కారణమవుతోంది. ఇప్పటికిప్పుడు ఎలాంటి తుది నిర్ణయం వెలువడకపోయినా, కాంగ్రెస్‌లోని అంతర్గత సమీకరణాలు వేగంగా మారుతున్నాయనే సంకేతాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొండా వర్గం గతంలో తన రాజకీయ ప్రభావంతో వరంగల్ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు అదే ప్రభావాన్ని పరిమితం చేసే ప్రయత్నం జరుగుతోందా అనే అనుమానాలు ఆ వర్గంలో ఆందోళన పెంచుతున్నాయి. రేవంత్ రెడ్డి మాస్టర్ స్ట్రోక్ అంటే ఇదేనా? ప్రత్యక్ష పోరాటం లేకుండానే ప్రత్యర్థి రాజకీయ బలాన్ని తగ్గించే వ్యూహమా? అనే ప్రశ్నలకు సమాధానం రాబోయే పరిణామాలే చెప్పాల్సి ఉంది.

**• వరంగల్ ఈస్ట్‌లో వ్యతిరేకత మాట**

వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు కీలక నేతలు కొండా వర్గానికి వ్యతిరేకంగా ఉన్నారనే వాదన ఈ చర్చలో ప్రధానంగా వినిపించింది. ఆయుబ్, బసవరాజు సారయ్య, నాయిని సుధారాణి, ఎమ్మెల్యే నాగరాజు, నాయిని రాజేందర్, కడియం శ్రీహరి వంటి నేతల పేర్లు ప్రస్తావనకు వచ్చాయి. వీరంతా ఒకే వేదికపై నిలబడి కొండా వర్గాన్ని వ్యతిరేకిస్తున్నారని నిర్ధారించే అధికారిక ప్రకటనలు లేవు. అయితే కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్లో విభిన్న వర్గాల మధ్య సమన్వయం, విభేదాలు సహజమే. ఈ చర్చలో మాత్రం కొండా సురేఖకు అనుకూలంగా ఉన్న రాజకీయ స్థలం క్రమంగా తగ్గుతోందనే అభిప్రాయం బలంగా వ్యక్తమైంది. ఒకప్పుడు నియోజకవర్గంలో బలమైన వ్యక్తిగత ప్రభావం కలిగిన నాయకత్వం ఇప్పుడు పార్టీ వ్యవస్థలో అనేక వర్గాల మధ్య చిక్కుకుపోయిందనే విశ్లేషణ వినిపిస్తోంది. ఒక నాయకుడి బలం కేవలం ఓటర్ల మద్దతుతోనే నిర్ణయించబడదు.. పార్టీ కూడా కీలకమే. ఈ కోణంలో చూస్తే వరంగల్ ఈస్ట్‌లో జరుగుతున్న పరిణామాలు ప్రాధాన్యత సంతరించుకుంటాయి. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో స్థానిక నేతల మధ్య సమన్వయం లేకపోతే, వచ్చే ఎన్నికల సమయానికి అది పెద్ద రాజకీయ సమస్యగా మారే అవకాశం ఉంటుంది. ఇదే అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి శిబిరం కూడా పరిశీలిస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. అయితే ఇది అధికారికంగా నిర్ధారించబడిన వ్యూహం కాదని గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం వినిపిస్తున్నవి కాంగ్రెస్ అంతర్గత వర్గాల రాజకీయ అంచనాలు, చర్చలే. అయినప్పటికీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. వరంగల్ ఈస్ట్‌లో కొండా వర్గం గతంలో ఉన్నంత ఏకపక్ష రాజకీయ ఆధిపత్యంలో లేదనే భావన పార్టీలోని కొన్ని వర్గాల్లో బలపడుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో టికెట్ కేటాయింపు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది.

**• సీఎం వ్యూహం.. నేరుగా ఢీకొనకుండానే**

రేవంత్ రెడ్డి రాజకీయ శైలిపై విశ్లేషణ చేసే వారు ఒక అంశాన్ని తరచూ ప్రస్తావిస్తారు. ప్రత్యక్షంగా గొడవకు దిగకుండా, పార్టీలోనే ప్రత్యామ్నాయ శక్తులను బలోపేతం చేయడం ద్వారా ప్రత్యర్థి ప్రభావాన్ని తగ్గించడం ఆయన రాజకీయ వ్యూహాల్లో ఒకటిగా కనిపిస్తుందని చెబుతారు. వరంగల్ పరిణామాలను కూడా ఇదే కోణంలో కొందరు చూస్తున్నారు. కొండా కుటుంబంతో నేరుగా ఘర్షణకు దిగకుండా, నియోజకవర్గంలో ఇతర నేతలకు రాజకీయ స్థలం పెంచితే సహజంగానే సమీకరణాలు మారిపోతాయి. అదే సమయంలో కొండా వర్గానికి చెందిన నాయకులపై పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చే ప్రతి సంకేతం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీస్తోంది. గతంలో సోషల్ మీడియా వ్యాఖ్యలు, పార్టీ అంతర్గత వివాదాలు, నాయకుల మధ్య అసంతృప్తి వంటి అంశాలు చర్చకు వచ్చిన సందర్భాలు ఉన్నాయని ఈ రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఒకసారి పార్టీ నాయకత్వం నుంచి దూరం పెరిగిందనే భావన కార్యకర్తల్లో ఏర్పడితే, దాన్ని తిరిగి సరిచేయడం అంత సులభం కాదు. అందుకే ప్రస్తుతం కొండా వర్గం కూడా ప్రతి అడుగును జాగ్రత్తగా వేయాల్సిన పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి కూడా వరంగల్ వంటి కీలక ప్రాంతాల్లో పార్టీ అంతర్గత సమతుల్యతను కాపాడాల్సిన అవసరం ఉంది. అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక వర్గపోరు పెద్ద సమస్యగా మారితే, ప్రతిపక్షాలకు అది రాజకీయ ఆయుధంగా మారుతుంది. అందుకే అధిష్ఠానం ఎవరి వ్యక్తిగత బలం కంటే పార్టీ బలాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయవచ్చు. ఈ మొత్తం పరిణామాన్ని "కొండా చాప్టర్ క్లోజ్" అని ఇప్పుడే తేల్చడం రాజకీయంగా అతిశయోక్తి కావచ్చు.. కానీ కొండా వర్గం రాజకీయంగా పునరాలోచించాల్సిన దశ మొదలైందనే సంకేతాలు మాత్రం కనిపిస్తున్నాయి. రేవంత్ వ్యూహం నిజంగా ఏ స్థాయిలో పనిచేస్తుందో తెలుసుకోవాలంటే పార్టీ భవిష్యత్ నిర్ణయాలు, నియోజకవర్గాల సమీకరణాలు, స్థానిక నాయకత్వ మార్పులు కీలకం కానున్నాయి.

**• ప్రకాష్ రెడ్డి అంశమే కీలక మలుపు**

ఈ రాజకీయ చర్చలో రేవూరు ప్రకాష్ రెడ్డి అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఆయన వయసు, భవిష్యత్ ఎన్నికల్లో అవకాశాలు, పార్టీ నాయకత్వం నుంచి వచ్చే సంకేతాలపై చర్చ జరిగింది. వచ్చే ఎన్నికల్లో కొత్త తరానికి అవకాశం ఇవ్వాలనే ఆలోచన కాంగ్రెస్‌లో బలపడితే, ప్రస్తుత సీనియర్ నాయకుల రాజకీయ స్థానం సహజంగానే ప్రశ్నార్థకమవుతుంది. ప్రకాష్ రెడ్డి వంటి సీనియర్ నేతలకు సంబంధించి టికెట్ విషయంపై ఇప్పటివరకు అధికారిక నిర్ణయం వెలువడలేదు. అయినప్పటికీ రాజకీయంగా వయసు, చురుకుదనం, నియోజకవర్గంలో నిరంతర పర్యటన, కార్యకర్తలతో సంబంధాలు వంటి అంశాలు భవిష్యత్ అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యత పొందవచ్చని చర్చ జరుగుతోంది. ఇదే నేపథ్యంలో సీనియర్ నేతలు తమ రాజకీయ భవిష్యత్‌ను ముందుగానే పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. గ్రామం గ్రామానికి వెళ్లడం, ప్రజలతో నిరంతరం కలవడం, యువతతో అనుసంధానం పెంచుకోవడం, స్థానిక సమస్యలపై పోరాడటం వంటి కార్యక్రమాలే భవిష్యత్ రాజకీయ బలానికి పునాది అవుతాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పుడు ఈ పని ప్రారంభిస్తేనే తర్వాత టికెట్ కోసం పోటీ చేసే సమయంలో బలం ఉంటుంది. డబ్బు, పాత పరిచయాలు మాత్రమే రాజకీయ విజయాన్ని నిర్ణయించవు. ప్రజల్లో కనిపించడం, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, స్థానిక సమస్యలపై స్పందించడం కూడా సమానంగా కీలకం. ఈ అంశాన్ని కొండా వర్గానికి సంబంధించిన రాజకీయ చర్చతో కలిపి చూస్తే మరో కోణం బయటపడుతోంది. పాత రాజకీయ శక్తులను క్రమంగా పక్కకు జరిపి కొత్త ముఖాలకు స్థానం కల్పించాలనే వ్యూహం కాంగ్రెస్‌లో ఎక్కడైనా అమలైతే, దాని ప్రభావం వరంగల్‌పై కూడా పడవచ్చు. అయితే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ, డిలిమిటేషన్ వంటి అంశాలపై స్పష్టత వచ్చే వరకు ఎవరి రాజకీయ భవిష్యత్‌పై తుది నిర్ణయానికి రావడం తొందరపాటు అవుతుంది. నియోజకవర్గాల సరిహద్దులు మారితే ఇప్పటి సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉంటుంది. అందుకే ప్రస్తుత రాజకీయ పరిస్థితిని భవిష్యత్ ఎన్నికల తుది చిత్రంగా చూడటం సరికాదు.



యంత్రాంగం, స్థానిక నేతల సహకారం, కార్యకర్తల నెట్‌వర్క్, భవిష్యత్ టికెట్ సమీకరణాలు

**• వయసు కాదు.. రాజకీయ చురుకుదనం ముఖ్యం**

ఈ చర్చలో మరో ముఖ్యమైన అంశం సీనియర్ నాయకుల రాజకీయ భవిష్యత్. రాజకీయాల్లో అనుభవం ఎంత ముఖ్యమో, ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా మారే సామర్థ్యం కూడా అంతే ముఖ్యం. ఇరవై ఏళ్ల క్రితం ఉన్న శారీరక చురుకుదనం ఇప్పుడు ఉండకపోవచ్చు.. అదే సమయంలో రాజకీయ అనుభవం మాత్రం మరింత పెరిగి ఉంటుంది. అందుకే సీనియర్ నాయకులు తమ అనుభవాన్ని కొత్త తరంతో కలిపి ఉపయోగించుకోవడం అవసరం. గ్రామస్థాయిలో కార్యకర్తలతో సంబంధాలు పెంచుకోవడం, యువతకు బాధ్యతలు అప్పగించడం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడం వంటి చర్యలు పార్టీ లోపల వారి విలువను పెంచుతాయి. ఎన్నికలు వచ్చిన తర్వాత ఒక్కసారిగా ప్రజల్లోకి వెళ్లడం కంటే, ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో కనిపించడం మరింత ప్రభావవంతంగా ఉంటుంది. ఈ కోణంలో చూస్తే ప్రస్తుతం వరంగల్ రాజకీయాల్లో జరుగుతున్న చర్చ ఒక వర్గానికి మాత్రమే సంబంధించినది కాదు. కాంగ్రెస్‌లో భవిష్యత్ నాయకత్వం ఎలా ఉండాలి? పాత నేతలకు ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి? కొత్త తరానికి ఎంత స్థలం ఇవ్వాలి? అనే పెద్ద ప్రశ్నలకు కూడా ఇది సంకేతంగా మారుతోంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రాంతాల్లో పాత సమీకరణాలు మారుతున్నాయి. అధికార వ్యవస్థకు దగ్గరగా ఉన్నవారికి మాత్రమే రాజకీయ భవిష్యత్ ఉండదు. ప్రజల్లో బలం ఉన్నవారు, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా ఉన్నవారు, యువతను ఆకట్టుకునే సామర్థ్యం ఉన్నవారు కూడా కీలకంగా మారుతున్నారు. ఈ మార్పును గుర్తించకపోతే సీనియర్ నేతలు రాజకీయంగా వెనుకబడే ప్రమాదం ఉంటుంది. అందుకే ప్రస్తుత పరిస్థితిని కొండా వర్గానికి హెచ్చరికగా చూడాలా, లేక సాధారణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయ ప్రక్రియగా చూడాలా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. ప్రస్తుతం మాత్రం వరంగల్ ఈస్ట్‌లో ఎవరి మాట నడుస్తుంది అనే ప్రశ్నకు పాత సమాధానం కాకుండా కొత్త సమాధానం కోసం కాంగ్రెస్‌లో ప్రయత్నం జరుగుతోందనే భావన బలపడుతోంది.

**• చాప్టర్ క్లోజ్ కాదు.. కొత్త గేమ్**

కొండా సురేఖ రాజకీయ ప్రస్థానం ఒక్కరోజులో ముగిసిపోతుందని చెప్పడం ఇప్పుడే సాధ్యం కాదు. ఆమెకు రాజకీయ అనుభవం ఉంది, ప్రజల్లో పరిచయం ఉంది, గతంలో కీలక పదవులు నిర్వహించిన అనుభవం ఉంది. అయితే ఏ నాయకుడి రాజకీయ భవిష్యత్ అయినా పార్టీ సమీకరణాలు, ప్రజా మద్దతు, నాయకత్వంతో సంబంధాలు, ఎన్నికల పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం వరంగల్ ఈస్ట్‌లో వినిపిస్తున్న అసంతృప్తి, ఇతర కాంగ్రెస్ నేతల పేర్లు చర్చలోకి రావడం, సీనియర్ నాయకుల భవిష్యత్‌పై ప్రశ్నలు, డిలిమిటేషన్‌పై అనిశ్చితి వంటి అంశాలు కలిపి చూస్తే రాజకీయ చిత్రం ఇంకా పూర్తిగా ఖరారు కాలేదని చెప్పాలి. సీఎం రేవంత్ రెడ్డి నిజంగా కొండా వర్గాన్ని పక్కకు నెట్టే వ్యూహం అమలు చేస్తున్నారా లేదా పార్టీని అంతర్గతంగా పునర్వ్యవస్థీకరించే ప్రక్రియలో భాగంగానే ఈ పరిణామాలు జరుగుతున్నాయా అన్నది తేలాల్సి ఉంది. కానీ ఒక విషయం మాత్రం రాజకీయంగా ఆసక్తికరంగా ఉంది.. కొండా వర్గం ఇకపై తన పాత రాజకీయ పద్ధతులతోనే ముందుకు సాగితే సరిపోతుందా అనే ప్రశ్న ఎదురవుతోంది. పార్టీ అధిష్ఠానంతో సంబంధాలు బలోపేతం చేయడం, స్థానిక నేతలతో సమన్వయం పెంచడం, కార్యకర్తలను తిరిగి ఒకే వేదికపైకి తీసుకురావడం, ప్రజా సమస్యలపై చురుకుగా పనిచేయడం ఇప్పుడు ఆ వర్గానికి కీలకంగా మారవచ్చు. మరోవైపు రేవంత్ రెడ్డి శిబిరం కూడా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిందే. ఎందుకంటే బలమైన ప్రాంతీయ నేతను పూర్తిగా పక్కకు జరపాలంటే ప్రత్యామ్నాయ నాయకత్వం ప్రజల్లో నిలబడే స్థాయిలో ఉండాలి. లేకపోతే అంతర్గత విభేదాలు పార్టీకి నష్టాన్ని తెచ్చే అవకాశం ఉంటుంది. అందుకే ఇది "కొండా సురేఖ చాప్టర్ క్లోజ్" కంటే.. "కొండా వర్గానికి కొత్త రాజకీయ పరీక్ష" అని చెప్పడం సరైనది. సీఎం వ్యూహం ఎంతవరకు సక్సెస్ అవుతుంది? కొండా వర్గం ఎలాంటి ప్రతివ్యూహం రచిస్తుంది? వరంగల్ ఈస్ట్‌లో కొత్త నాయకత్వం ఎదుగుతుందా? వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ టికెట్ ఎవరికి దక్కుతుంది? ఈ ప్రశ్నలకు ఇప్పుడే సమాధానాలు లేవు. కానీ ప్రస్తుత పరిణామాలు మాత్రం వరంగల్ కాంగ్రెస్‌లో పాత సమీకరణాలకు సవాల్ విసురుతున్నాయి. రేవంత్ మాస్టర్ స్ట్రోక్ నిజంగా పనిచేస్తే.. వరంగల్ ఈస్ట్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలయ్యే అవకాశం ఉంది.

**• ఓరుగల్లు ఇకపై ఏ లెక్క మారుతుందో?**

ఓరుగల్లు రాజకీయ చరిత్రలో ఇది మరో కీలక మలుపు కాబోతోందా? ఇన్నాళ్లు తమదైన ముద్రతో రాజకీయాలను నడిపించిన కొండా దంపతులకు ఇప్పుడు ఎదురవుతున్న పరిణామాలు భవిష్యత్ గమనాన్ని మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం.. మరోవైపు వరంగల్ ఈస్ట్‌లో మారుతున్న అంతర్గత సమీకరణాలు.. ఇంకోవైపు కొత్త తరానికి పెరుగుతున్న ప్రాధాన్యత.. ఇవన్నీ కలిస్తే ఓరుగల్లు రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారే అవకాశం ఉంది. అయితే ఇప్పుడే ఎవరి చాప్టర్ క్లోజ్ అయిందని తేల్చడం తొందరపాటే. డిలిమిటేషన్ తర్వాత నియోజకవర్గాల రూపురేఖలు మారితే పాత లెక్కలన్నీ తలకిందులయ్యే అవకాశం ఉంది. ఎవరెవరు ఎటు వైపు నిలబడతారు? ఎవరికి పార్టీ అండగా నిలుస్తుంది? కొండా దంపతులు కొత్త వ్యూహంతో తిరిగి పుంజుకుంటారా? లేక కొత్త నాయకత్వం ఓరుగల్లు రాజకీయ పగ్గాలు చేపడుతుందా? ఇప్పుడే చెప్పలేం.. కానీ రాబోయే రోజుల్లో ఓరుగల్లు గడ్డ మీద జరిగే ప్రతి అడుగు రాజకీయ చరిత్రలో కొత్త పేజీ రాయబోతోంది.

### ఇంకా చాలా ఉంది!

**ఓరుగల్లులో కొండా దంపతులకు షాక్**

వరంగల్ ఈస్ట్‌లో కొండా దంపతుల రాజకీయ ఆధిపత్యంపై ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. ఇన్నాళ్లు తమదైన శైలిలో రాజకీయాలను నడిపించిన కొండా వర్గానికి పార్టీలోనే వ్యతిరేకత పెరుగుతోందన్న టాక్ వినిపిస్తోంది. స్థానికంగా పలువురు కీలక నేతలు దూరంగా ఉన్నారనే ప్రచారం కొండా వర్గానికి ఇబ్బందికరంగా మారింది. ఈ పరిణామాలు భవిష్యత్ కాంగ్రెస్ రాజకీయ సమీకరణాలకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

**రేవంత్ రెడ్డి వ్యూహమేంటీ?**

సీఎం రేవంత్ రెడ్డి నేరుగా ఢీకొనకుండా రాజకీయ సమీకరణాలను మార్చే ప్రయత్నం చేస్తున్నారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. వరంగల్‌లో ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని బలోపేతం చేస్తే కొండా వర్గం ప్రభావం సహజంగానే తగ్గుతుందనే అంచనాలు ఉన్నాయి. ప్రత్యక్ష పోరాటం కంటే పార్టీ వ్యవస్థను బలోపేతం చేసే వ్యూహమే రేవంత్ లెక్కగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**సీనియర్లకు కొత్త సవాల్**

రాబోయే ఎన్నికల్లో సీనియర్ నాయకుల కంటే చురుకైన కొత్త తరానికి ప్రాధాన్యత పెరగవచ్చనే చర్చ కీలకంగా మారింది. వయసు, అనుభవంతో పాటు ప్రజల్లో నిరంతర అందుబాటు, గ్రామస్థాయి సంబంధాలు, యువతతో అనుసంధానం ఇప్పుడు ముఖ్యమైన అంశాలుగా మారుతున్నాయి. ఎన్నికల ముందు కాకుండా ఇప్పటి నుంచే ప్రజల్లో తిరిగే నాయకులకే భవిష్యత్‌లో అవకాశాలు పెరగవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

**డిలిమిటేషన్‌తో లెక్కలు తారుమారు**

డిలిమిటేషన్ జరిగితే ప్రస్తుత నియోజకవర్గాల సరిహద్దులు, రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉంది. వరంగల్ ఈస్ట్‌లో ఎవరి ప్రభావం ఎంత? ఎవరి ఓటు బ్యాంకు ఎక్కడ? ఏ నాయకుడికి ఏ ప్రాంతంలో బలం ఉంది? అన్న లెక్కలు కొత్తగా మారవచ్చు. అందుకే ఇప్పుడే టికెట్లు, భవిష్యత్ పదవులపై తుది నిర్ణయాలకు రావడం తొందరపాటు అనే అభిప్రాయం ఉంది.

**చాప్టర్ క్లోజ్ కాదు.. కొత్త గేమ్**

కొండా సురేఖ రాజకీయ అధ్యాయం ముగిసిందని ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదు. అయితే ఇప్పటి పరిణామాలు మాత్రం కొండా దంపతులకు కొత్త రాజకీయ పరీక్ష మొదలైందనే సంకేతం ఇస్తున్నాయి. ఓరుగల్లు గడ్డపై పాత పట్టు నిలబెట్టుకుంటారా? కొత్త వ్యూహంతో తిరిగి బలపడతారా? లేక రేవంత్ లెక్కలకు కొత్త నాయకత్వం తెరపైకి వస్తుందా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.





నేపాల్–టిబెట్ సరిహద్దులో ఆకస్మిక వరదలతో కైలాష్ మానసరోవర్ యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమ్మిగ్రేషన్ కేంద్రంలో ఉన్న ఈషా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది ఆచూకీ తెలియడం లేదు. వీరిలో 77 మంది యాత్రికులు, ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు. వరదల తర్వాత వారితో సంబంధాలు తెగిపోవడంతో కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ గ్యిరాంగ్‌కు వెళ్లి గాలింపు చర్యల్లో సహకరించేందుకు చైనా అధికారుల అనుమతి కోరారు. ఇదిలా ఉండగా తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు యాత్రికులు కూడా ప్రభావిత ప్రాంతంలో ఉండటంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఏపీ అధికారులు యాత్రికుల వివరాలు సేకరిస్తూ కుటుంబాలకు సమాచారం అందించే ప్రయత్నం చేస్తున్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో దౌత్య మార్గాల్లోనూ సమన్వయం కొనసాగుతోంది. గల్లంతైన వారంతా సురక్షితంగా బయటపడాలని కుటుంబాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.

# గ్యిరాంగ్ వరదల్లో విషాదం

## సద్గురు కన్నీరుమున్నీరు



నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. కైలాష్ మానసరోవర్ యాత్రకు వెళ్లిన పలువురు యాత్రికులు వరదల్లో చిక్కుకున్నారు. టిబెట్‌లోని గ్యిరాంగ్ ప్రాంతంలో భారీ వరద ప్రవాహం ఒక్కసారిగా దూసుకురావడంతో అక్కడి ఇమ్మిగ్రేషన్ కేంద్రం పూర్తిగా ధ్వంసమైంది. అదే సమయంలో కైలాష్ యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న ఈషా ఫౌండేషన్‌కు చెందిన బృందం అక్కడే ఉంది. వరదల తర్వాత ఆ బృందంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఈషా ఫౌండేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం 80 మంది సభ్యుల ఆచూకీ తెలియడం లేదు. వీరిలో 77 మంది యాత్రికులు, ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు. గల్లంతైన వారిలో 34 మంది పురుషులు, మిగిలిన వారు మహిళలని సద్గురు జగ్గీ వాసుదేవ్ తెలిపారు. ఈ బృందంలో ఒక వైద్యుడు కూడా ఉన్నట్లు సమాచారం. గ్యిరాంగ్ ఇమ్మిగ్రేషన్ కేంద్రంలో ఉన్న సమయంలోనే వరద నీరు ఒక్కసారిగా భవనంలోకి ప్రవేశించిందని సమాచారం. భారీగా మట్టి, రాళ్లు, నీరు దూసుకురావడంతో భవనం కొట్టుకుపోయినట్లు సద్గురు వివరించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో గల్లంతైన వారి కుటుంబాల్లో ఆందోళన పెరిగింది. వారి నుంచి ఎలాంటి అధికారిక సమాచారం ఇప్పటివరకు అందలేదని సద్గురు చెప్పారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తనకు అత్యంత సన్నిహితంగా ఉన్న యాత్రికులు కనిపించకపోవడం పట్ల కన్నీటి పర్యంతమయ్యారు. గల్లంతైన వారి కుటుంబాలకు కనీస సమాచారం అందించాలని కోరుతూ చైనా అధికారులను ఆశ్రయించారు.

### గ్యిరాంగ్‌కు వెళ్లేందుకు అనుమతి కోరిన సద్గురు

ప్రస్తుతం తాను సాగా ప్రాంతంలో ఉన్నానని, గ్యిరాంగ్ వెళ్లేందుకు అనుమతి లభిస్తే స్వయంగా వెళ్లి గాలింపు చర్యలకు సహకరిస్తానని సద్గురు తెలిపారు. రెస్క్యూ బృందాలు చేస్తున్న పనులకు తాము ఎలాంటి ఆటంకం కలిగించబోమని స్పష్టం చేశారు. తమ ఉద్దేశం కేవలం గల్లంతైన వారి కోసం ఏదైనా ఆనవాలు కనుగొనడమేనని చెప్పారు. కుటుంబ సభ్యులకు కొంతైనా సమాచారం అందించేందుకు తమను ప్రభావిత ప్రాంతానికి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విపత్తు సమయంలో గ్యిరాంగ్‌కు వెళ్లే రహదారులు, సమాచార వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రోడ్లు తెగిపోవడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయకపోవడంతో సహాయక చర్యలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. కీలకమైన ఇమ్మిగ్రేషన్ కేంద్రం వరద ధాటికి పూర్తిగా కొట్టుకుపోవడంతో అక్కడ ఉన్న వారి పరిస్థితిపై స్పష్టత రావడం కష్టంగా మారింది. ఇదే సమయంలో నేపాల్ వైపు కూడా భారీ నష్టం జరిగింది. గ్రామాలు, వంతెనలు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు వరదల్లో దెబ్బతిన్నాయి. కైలాష్ మానసరోవర్ యాత్రకు ఉపయోగించే మార్గం కావడంతో ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన యాత్రికులు ఈ ప్రాంతంలో చిక్కుకున్నారు. భారతీయుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. నేపాల్‌లో మృతుల సంఖ్య పెరుగుతుండగా, గల్లంతైన వారి సంఖ్యపై అధికారిక లెక్కలు మారుతూ ఉన్నాయి. టిబెట్‌లోని గ్యిరాంగ్ ప్రాంతంలో కూడా వందలాది మంది ఆచూకీ తెలియకుండా పోయినట్లు చైనా అధికారులు వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈషా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది గల్లంతు కావడం విషాదాన్ని మరింత పెంచింది. ప్రస్తుతం ప్రధాన లక్ష్యం గల్లంతైన వారిని గుర్తించడం, ప్రాణాలతో ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం. కుటుంబ సభ్యులు మాత్రం తమవారి సమాచారం

### సద్గురు కన్నీళ్లు.. ఆచూకీ కోసం విజ్ఞప్తి

ఈ ఘటనపై మాట్లాడిన సద్గురు జగ్గీ వాసుదేవ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సాధారణంగా ప్రశాంతంగా కనిపించే సద్గురు ఈసారి గల్లంతైన వారి వివరాలు చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు. గ్యిరాంగ్‌లో పరిస్థితి అత్యంత తీవ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు. తన బృందానికి చెందిన వారు ఇమ్మిగ్రేషన్ కేంద్రంలో ఉన్న సమయంలోనే విపత్తు సంభవించిందని తెలిపారు. ఈషా ఫౌండేషన్ బృందం నుంచి వచ్చిన చివరి సమాచారం ప్రకారం బృంద నాయకుడు ఇషంగా ప్రవీణ్ ఉదయం 9.05 గంటలకు తాము ఇమ్మిగ్రేషన్ కేంద్రానికి చేరుకున్నామని సమాచారం ఇచ్చారు. కేవలం కొన్ని నిమిషాల తర్వాత ఉదయం 9.14 గంటల సమయంలో భారీ వరద దూసుకొచ్చినట్లు సద్గురు తెలిపారు. ఆ తర్వాత ఆయన ఫోన్ మళ్లీ పనిచేయలేదు. నేపాల్ సరిహద్దు వైపు ఫోన్ యాక్టివేట్ అవుతుందేమోనని ఎదురుచూసినా ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. కేవలం నిమిషాల వ్యవధిలోనే ఒక యాత్రికుల బృందం మొత్తం ప్రపంచానికి దూరమైపోయిన పరిస్థితి ఏర్పడింది. గ్యిరాంగ్ ప్రాంతంలో జరిగిన విధ్వంసం తీవ్రతను చూస్తే పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సద్గురు పేర్కొన్నారు. అయితే అధికారికంగా మరణించినట్లు ధ్రువీకరణ రాలేదని, అందువల్ల గల్లంతైన వారిని ప్రాణాలతో వెతికే ప్రయత్నాలు కొనసాగాల్సిందేనని ఆయన సూచించారు. చైనా అధికారుల అనుమతి లభిస్తే తాను స్వయంగా అక్కడికి వెళ్లి గాలింపు చర్యల్లో పాల్గొనాలని కోరుతున్నారు. భారత, చైనా దౌత్య వర్గాలతో కూడా సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గల్లంతైన వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న మానసిక వేదనను దృష్టిలో పెట్టుకుని తమకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని కోరారు. రెస్క్యూ చర్యలను అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదని సద్గురు స్పష్టం చేశారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తోడ్పాటుగా ఉండటం, గల్లంతైన వారి ఆనవాళ్లు గుర్తించడం, కుటుంబాలకు సమాచారం అందించడం మాత్రమే తమ లక్ష్యమని వివరించారు.

### 21 బృందాలు.. 80 మంది గల్లంతు..

ఇదే సమయంలో ఈషా ఫౌండేషన్ నిర్వహించిన కైలాష్ యాత్రలో మొత్తం 21 బృందాలు పాల్గొన్నట్లు వెల్లడైంది. వారిలో 495 మంది ఇప్పటికే సురక్షితంగా తిరిగి వచ్చారు. 743 మంది టిబెట్‌లో, 148 మంది నేపాల్‌లో ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ సంఖ్యల మధ్య గ్యిరాంగ్ ఇమ్మిగ్రేషన్ కేంద్రంలో ఉన్న 77 మంది యాత్రికులపై సమాచారం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముగ్గురు వాలంటీర్ల వివరాలు కూడా తెలియకపోవడంతో మొత్తం గల్లంతైన వారి సంఖ్య 80కి చేరింది. 80 మంది గల్లంతు అనేది కేవలం ఒక సంఖ్య కాదు.. 80 కుటుంబాల ఆందోళన, వందలాది బంధువుల ఎదురుచూపు. అందుకే గాలింపు చర్యలను వేగవంతం చేయాలని కుటుంబాలు కోరుతున్నాయి. సద్గురు కూడా ఇదే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్నా, కమ్యూనికేషన్ వ్యవస్థలు తెగిపోయినా గల్లంతైన వారిని వెతికే ప్రయత్నాలు ఆగకూడదని ఆయన సూచించారు. సహాయక చర్యలకు అవసరమైన అన్ని మార్గాలను వినియోగించాలని కోరారు. గ్యిరాంగ్ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రత్యేక అనుమతి లభిస్తే ఈషా ఫౌండేషన్ నుంచి స్వచ్ఛంద సేవకుల బృందాన్ని తీసుకెళ్లి స్థానిక రెస్క్యూ బృందాలకు సహకరిస్తామని చెప్పారు. కుటుంబ సభ్యులకు తమవారి పరిస్థితిపై కనీస సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ప్రతి నిమిషం కీలకంగా మారింది. శిథిలాలు, బురద, రాళ్ల మధ్య గాలింపు కొనసాగు ఎదురవుతున్నాయి. హెలికాప్టర్ల ద్వారా గాలింపు, సహాయక సామగ్రి తరలింపు జరుగుతోంది. ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో మరిన్ని వరదలు లేదా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉండటంతో రెస్క్యూ బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గల్లంతైన 80 మంది కోసం సద్గురు చేసిన విజ్ఞప్తి అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది.

### తెలుగు రాష్ట్రాల్లోనూ ఆందోళన

నేపాల్ -టిబెట్ సరిహద్దు విపత్తు ప్రభావం భారతీయులపై కూడా తీవ్రంగా పడింది. కైలాష్ మానసరోవర్ యాత్రకు వెళ్లిన భారతీయుల్లో పలువురు వరదల కారణంగా చిక్కుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన యాత్రికులు కూడా ఈ ప్రాంతంలో ఉన్నందున ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. తమ రాష్ట్రాల నుంచి యాత్రకు వెళ్లిన వారి వివరాలను సేకరించే ప్రక్రియ మొదలైంది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. హెల్ప్‌లైన్‌లు, కాల్ సెంటర్ల ద్వారా వివరాలు సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల కుటుంబాల్లో కూడా ప్రస్తుతం ఒకే ప్రశ్న వినిపిస్తోంది.. తమవారు ఎక్కడ ఉన్నారు? సురక్షితంగా ఉన్నారా? సరిహద్దు ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో సమాచారం సేకరించడం కష్టంగా మారింది. కొంతమంది యాత్రికులు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం అందగా, మరికొందరు మార్గమధ్యంలో చిక్కుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన 31 మంది యాత్రికులు వరదలకు కొన్ని గంటల ముందు ప్రమాద ప్రాంతాన్ని దాటడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆ బృందంలో మాజీ డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి కూడా ఉన్నారు. వారు ప్రస్తుతం సాగా ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు గ్యిరాంగ్ ప్రాంతంలో చిక్కుకున్న వారి కుటుంబాలు మాత్రం స్పష్టమైన సమాచారం కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ విపత్తు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం కూడా నేపాల్‌కు సహాయక సామగ్రిని పంపింది. రక్షణ చర్యలకు అవసరమైన వస్తువులతో పాటు తాత్కాలిక ఆశ్రయ సామగ్రి, దుప్పట్లు, మందులు, పరిశుభ్రత కిట్లు, సౌర దీపాలు వంటి సామగ్రిని భారత్ పంపినట్లు సమాచారం. భారతీయుల ఆచూకీ కోసం దౌత్య మార్గాల్లో కూడా సమన్వయం కొనసాగుతోంది. నేపాల్ సైన్యం, సాయుధ పోలీసు దళాలు, పోలీసులు గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. హెలికాప్టర్ల ద్వారా చిక్కుకున్న వారిని తరలిస్తున్నారు. టిబెట్ వైపు చైనా అధికారులు కూడా గాలింపు చర్యలు చేపట్టారు.

### గ్యిరాంగ్‌లో నిలిచిన గాలింపు..

గ్యిరాంగ్ పోర్టుకు వెళ్లే రహదారులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థలు నిలిచిపోవడం వల్ల అక్కడి పరిస్థితిపై పూర్తి సమాచారం రావడం లేదు. ఈ నేపథ్యంలో ఈషా ఫౌండేషన్ సభ్యుల కోసం ప్రతి ప్రయత్నం కీలకంగా మారింది. ఒకవైపు సహాయక బృందాలు ప్రమాదకర పరిస్థితుల్లో గాలింపు కొనసాగిస్తుంటే, మరోవైపు కుటుంబ సభ్యులు తమవారి ఆచూకీ కోసం ఎదురు చూస్తున్నారు. వరదలకు కారణంగా హిమాలయ ప్రాంతంలో కొండచరియ నీరు దిగువ ప్రాంతాలకు రావడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనతో సరిహద్దు ప్రాంతాల్లో విపత్తు నిర్వహణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కైలాష్ యాత్ర మార్గంలో ఉన్న యాత్రికుల భద్రతపై మరింత అప్రమత్తత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం గల్లంతైన వారిలో ఎవరైనా సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారా అనే దానిపై అధికారిక నిర్ధారణ కోసం కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. 80 మంది గల్లంతైనట్లు సమాచారం వచ్చినప్పటికీ, అధికారికంగా వారి పరిస్థితి నిర్ధారణ కాలేదనే అంశం అత్యంత కీలకం. అందువల్ల గల్లంతైన వారిని మృతులుగా ప్రకటించకుండా, పూర్తి స్థాయి గాలింపు కొనసాగించాల్సిన అవసరం ఉంది. సద్గురు కూడా ఇదే కారణంతో ప్రభావిత ప్రాంతానికి వెళ్లేందుకు అనుమతి కోరుతున్నారు. కుటుంబాలకు సమాచారం అందించడమే ఇప్పుడు ప్రధాన లక్ష్యం. సహాయక చర్యలు వేగవంతం కావాలి. సరిహద్దు దాటి సమన్వయం పెరగాలి. భారత దౌత్య యంత్రాంగం, చైనా అధికారులు, నేపాల్ రక్షణ బృందాలు పరస్పరం సహకరించి గల్లంతైన వారిని గుర్తించేందుకు కృషి చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యిరాంగ్ వరదలు కేవలం ఒక ప్రాంతాన్ని ముంచిన విపత్తు కాదు.. అనేక కుటుంబాలను ఆందోళనలోకి నెట్టిన మానవ విషాదం. యాత్రకు వెళ్లిన వారు సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబాలు ప్రార్థిస్తున్నాయి. గల్లంతైన 80 మంది విషయంలో స్పష్టమైన సమాచారం వెలువడే వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

### ఎదురుచూస్తున్న కుటుంబాలు

గ్యిరాంగ్ వరదలు వెళ్లిపోయాయి.. కానీ అక్కడ మిగిలింది 80 కుటుంబాల కన్నీటి ఎదురుచూపు. నిన్నటి వరకు కైలాష్ యాత్రలో ఆధ్యాత్మిక ఆనందంతో సాగిన ప్రయాణం.. ఒక్కసారిగా విషాదంగా మారింది. కొన్ని నిమిషాల్లోనే వరద నీరు ఇమ్మిగ్రేషన్ కేంద్రాన్ని ముంచెత్తింది. ఆ తర్వాత ఫోన్లు మూగబోయాయి.. మాటలు ఆగిపోయాయి.. తమవారు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి కుటుంబాలను కన్నీటిలో ముంచింది. గల్లంతైన వారి కోసం సద్గురు స్వయంగా అక్కడికి వెళ్లేందుకు అనుమతి కోరుతున్నారు. శిథిలాల మధ్య రెస్క్యూ బృందాలు గాలిస్తుంటే.. వేల కిలోమీటర్ల దూరంలో కుటుంబాలు ప్రతి ఫోన్ మోగినప్పుడూ ఉలిక్కిపడుతున్నాయి. ఒక్క సమాచారం కోసం.. ఒక్క ఫోన్‌కాల్ కోసం.. ఒక్కసారి తమవారి గొంతు వినేందుకు బంధువులు కళ్లల్లో ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. ఇది కేవలం ప్రకృతి విపత్తు కాదు.. తమవారిని వెతుక్కుంటూ నిలిచిపోయిన కుటుంబాల విషాద ప్రయాణం. గల్లంతైన 80 మంది సురక్షితంగా తిరిగి రావాలనే ప్రార్థనలే ఇప్పుడు గ్యిరాంగ్ నుంచి వేలాది ఇళ్ల వరకు మార్మోగుతున్నాయి. ఆ చీకటిలో ఒక్క చిన్న ఆనవాలు దొరికినా.. ఆ కుటుంబాల కళ్లలో మళ్లీ వెలుగు పుడుతుంది.

- కళ్ల ముందే జల విలయం
- ఈషా ఫౌండేషన్ సభ్యులు 80 మంది గల్లంతు
- కుటుంబాలకు సమాచారం కరువు
- కైలాష్ యాత్ర చరిత్రలోనే అతిపెద్ద దుర్ఘటన

### వైపరీత్యాలకు అంతం లేదా..

#### గ్యిరాంగ్ వరదల్లో 80 మంది గల్లంతు

నేపాల్–టిబెట్ సరిహద్దులో భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. టిబెట్‌లోని గ్యిరాంగ్ ప్రాంతంలో కైలాష్ యాత్ర ముగించుకుని తిరుగుతున్న సమయంలో ఈషా ఫౌండేషన్‌కు చెందిన బృందం ఇమ్మిగ్రేషన్ కేంద్రంలో ఉంది. వరద నీరు ఒక్కసారిగా దూసుకురావడంతో 80 మంది ఆచూకీ తెలియకుండా పోయింది.

#### సద్గురు భావోద్వేగం.. ప్రత్యేక అనుమతి

ఈషా ఫౌండేషన్ సభ్యుల ఆచూకీ తెలియకపోవడంతో సద్గురు జగ్గీ వాసుదేవ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యల్లో సహకరించేందుకు గ్యిరాంగ్ వెళ్లేందుకు అనుమతించాలని చైనా అధికారులను కోరారు. రెస్క్యూ చర్యలకు ఎలాంటి ఆటంకం కలిగించబోమని, కుటుంబాలకు సమాచారం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

#### కైలాష్ యాత్ర బృందంపై ఆందోళన

ఈషా ఫౌండేషన్ వివరాల ప్రకారం కైలాష్ యాత్రలో మొత్తం 21 బృందాలు పాల్గొన్నాయి. 495 మంది సురక్షితంగా తిరిగి వచ్చారు. 743 మంది టిబెట్‌లో, 148 మంది నేపాల్‌లో ఉన్నారు. గ్యిరాంగ్ ఇమ్మిగ్రేషన్ కేంద్రంలో ఉన్న 77 మంది యాత్రికులు, ముగ్గురు వాలంటీర్ల ఆచూకీ తెలియకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

#### తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అప్రమత్తం

వరదల ప్రభావంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు యాత్రికులు కూడా చిక్కుకున్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. యాత్రకు వెళ్లిన వారి వివరాలను సేకరిస్తూ కుటుంబాలకు సమాచారం అందించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రత్యేక కాల్‌సెంటర్లు ఏర్పాటు చేసి యాత్రికుల పరిస్థితిపై ఆరా తీస్తున్నాయి. దౌత్య మార్గాల్లోనూ సమన్వయం కొనసాగుతోంది.

#### గల్లంతైన వారి కోసం గాలింపు

భారీ వరదలకు కొండచరియలు, మంచు ప్రవాహాలు కారణమైనట్లు సమాచారం. మట్టి, రాళ్లు, నీరు భారీగా దిగువ ప్రాంతాలకు రావడంతో రహదారులు, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. రెస్క్యూ బృందాలు హెలికాప్టర్లతో గాలింపు కొనసాగిస్తున్నాయి. గల్లంతైన 80 మంది పరిస్థితిపై స్పష్టమైన సమాచారం కోసం కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.






# గెలవాల్సిన మ్యాచ్..

◆ డ్రాతో ముగిసిందన్న పడిక్కల్
◆ జట్టు గెలుపే ముఖ్యమన్న దేవదత్

కొలంబోలో శ్రీలంకతో జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగియడంపై భారత బ్యాటర్ దేవదత్ పడిక్కల్ నిరాశ వ్యక్తం చేశాడు. “ఈ మ్యాచ్‌లో గెలిస్తే ఇంకా బాగుండేది” అని పేర్కొన్నాడు. భారత్ 213 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో శ్రీలంకను ఫాలోఆన్ ఆడించింది. అయినా భారత బౌలర్లు శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో చివరి నాలుగు వికెట్లు తీయలేకపోయారు. సోనల్ దినూషా అజేయ 133 పరుగులతో అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను డ్రా వైపు నడిపించాడు. దీంతో భారత్ రెండో టెస్టులో విజయాన్ని అందుకోలేకపోయినా, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 10తో కైవసం చేసుకుంది. వ్యక్తిగత ప్రదర్శన కంటే జట్టు విజయమే ముఖ్యమని పడిక్కల్ స్పష్టం చేశాడు. అవకాశాలు వచ్చినప్పుడు మానసికంగా సిద్ధంగా ఉండాలని, ఒకసారి విఫలమైనా వెంటనే దానిని మర్చిపోయి తదుపరి బంతిపై దృష్టి పెట్టాలని చెప్పాడు. యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు మరింత మెరుగుపడేందుకు కృషి చేస్తుందని తెలిపాడు. ఈ సిరీస్‌లో పడిక్కల్ 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు. రెండు టెస్టుల్లో రెండు సెంచరీలతో 109.33 సగటు నమోదు చేశాడు.

# దినూషా గోడ.. శ్రీలంక డ్రా

◆ భారత్‌కు సిరీస్ విజయం.. లంకకు ఊరట
◆ 133 పరుగులతో అద్భుత పోరాటం

కొలంబోలో జరిగిన రెండో టెస్టులో శ్రీలంక అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. భారత్ విజయానికి చేరువగా కనిపించిన సమయంలో సోనల్ దినూషా అజేయ 133 పరుగులతో అడ్డుగోడగా నిలిచాడు. ఐదో రోజు పిచ్ పరిస్థితులు, వరుసగా బౌలింగ్ చేసిన భారత బౌలర్ల ఒత్తిడి, ఫాలోఆన్ ఆడాల్సిన అలసటను లెక్కచేయకుండా దినూషా అసాధారణ పట్టుదల చూపించాడు. 264 బంతులు ఎదుర్కొని 420 నిమిషాల పాటు క్రీజులో నిలిచిన అతడు శ్రీలంకను ఓటమి నుంచి బయటపడేశాడు. 196 బంతుల్లో సెంచరీ పూర్తి చేసిన దినూషాకు కేశర నువంత 46 పరుగులతో అండగా నిలిచాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 112 పరుగుల భాగస్వామ్యంతో భారత బౌలర్లను నిలువరించారు. అనంతరం జయసూర్య, లహిరు కుమార, అసిత ఫెర్నాండో కూడా దినూషాకు సహకరించడంతో శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 429/9 వద్ద డిక్లేర్ చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

## 1-0తో భారత్‌కు సిరీస్

మ్యాచ్ డ్రా అయినా రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 10తో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో గాలే వేదికగా భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సిరీస్‌లో దినూషా అసాధారణంగా రాణించాడు. రెండు టెస్టుల్లో 722 బంతులు ఎదుర్కొని 1,139 నిమిషాలు బ్యాటింగ్ చేశాడు. ఈ సిరీస్‌లో మూడు సెంచరీలు, నాలుగు 50కిపైగా స్కోర్లు సాధించడం అతడి పోరాటానికి నిదర్శనం. ఫాలోఆన్ ఆడుతున్న జట్టు తరఫున ఒకే టెస్టులో రెండు సెంచరీలు సాధించిన బ్యాటర్ల జాబితాలో దినూషా మూడో ఆటగాడిగా నిలిచాడు. భారత్ తరఫున విజయ్ హజారే, జింబాబ్వే తరఫున ఆండీ ఫ్లవర్ తర్వాత ఈ ఘనత సాధించాడు. మరోవైపు భారత బౌలర్లు చివరి వికెట్లను తీయలేకపోవడం నిరాశ కలిగించింది. రవీంద్ర జడేజా కీలక వికెట్లు తీసినా విజయం సాధించేందుకు అవసరమైన నాలుగు వికెట్లు సమయానికి పడగొట్టలేకపోయారు. అయినప్పటికీ 2023లో వెస్టిండీస్‌పై విజయం తర్వాత భారత్‌కు ఇదే తొలి విదేశీ టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కూడా విదేశాల్లో ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం.




## దినూషాపై గారీ కిర్‌స్టన్ ప్రశంస ల వర్షం

### కష్టాల్లోనే అసలు సత్తా చూపాడని కితాబు

శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినూషాపై ఆ జట్టు హెడ్ కోచ్ గ్యారీ కిర్‌స్టన్ ప్రశంసలు కురిపించాడు. “అతను కఠిన పరిస్థితుల్లో మరింత మెరుగ్గా ఆడతాడు. టెస్టు క్రికెట్‌లో అతని ఆటను చూడటం నాకు చాలా ఇష్టం” అని కిర్‌స్టన్ పేర్కొన్నాడు. కొలంబోలో భారత్‌తో జరిగిన రెండో టెస్టులో దినూషా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించి శ్రీలంకను ఓటమి నుంచి కాపాడాడు. ముఖ్యంగా రెండో ఇన్నింగ్స్‌లో అజేయ 133 పరుగులతో భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని మ్యాచ్‌ను డ్రాగా ముగించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే ఆటగాడిపై తరచూ ఒత్తిడి ఉంటుందని, దినూషా మాత్రం అలాంటి పరిస్థితులను ఆస్వాదిస్తాడని కిర్‌స్టన్ చెప్పాడు. తన బలాలకు అనుగుణంగా ఆడటం, పరిస్థితిని అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకోవడం దినూషా ప్రత్యేకత అని ప్రశంసించాడు.

# డబ్ల్యూటీసీలో ఇండియాకు షాక్

## డ్రాతో తగ్గిన భారత్ విజయశాతం

శ్రీలంకతో కొలంబోలో జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగియడంతో భారత జట్టు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలోనే కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌కు ముందు 53.33గా ఉన్న భారత్ విజయశాతం ఇప్పుడు 51.52కి పడిపోయింది. 11 టెస్టుల్లో భారత్ ఐదు విజయాలు, రెండు డ్రాలతో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ భారత్ కంటే ముందున్నాయి. శ్రీలంక 33.33 విజయశాతంతో ఆరో స్థానంలో ఉంది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో భారత్‌కు ఇక ప్రతి మ్యాచ్ కీలకంగా మారింది. శ్రీలంక సిరీస్ తర్వాత భారత్ మరో ఏడు టెస్టులు ఆడాల్సి ఉంది. న్యూజిలాండ్‌తో రెండు, ఆస్ట్రేలియాతో ఐదు టెస్టులు ఉన్నాయి. ఈ ఏడు మ్యాచ్‌ల్లో కనీసం ఐదు విజయాలు సాధించాల్సిన పరిస్థితి భారత్‌కు ఏర్పడింది. తొలి టెస్టులో 165 పరుగుల విజయంతో భారత్ సిరీస్‌ను 10తో గెలిచినా, డబ్ల్యూటీసీ లెక్కల్లో ఈ డ్రా భారత్ అవకాశాలను కొంత క్లిష్టం చేసింది.




# నటుడు నారాయణరావు కన్నుమూత





ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్. కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.



# రణబాలి రిలీజ్ అక్టోబర16కు మార్పు

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు. తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.






# సినిమా విజయం అందరిది

## ఇరుడముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు



ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. ‘ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి‘ అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు‘ అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్థమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం‘ అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్

# మరోమారు సుక్కుతో ...



## రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం

టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.